
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106


సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 । కనిష్ఠం 19.4



నమో.. నారసింహ

పాతగుట్టలో లక్ష్మీనరసింహుడిని తిరువీధిలో ఊరేగిస్తున్న అర్చకులు

- కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు
- వైభవంగా నమ్మాళ్వార్ పరమపదోత్సవం
- రేపటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

●7లో..

శివోహం

- కన్నుల పండువగా చెర్వుగట్టులో శివకల్యాణం
- పోటెత్తిన భక్తజనం

కల్యాణవేదికపైకి ఉత్సవమూర్తులను తీసుకువస్తున్న భక్తులు, కల్యాణోత్సవంలో భాగంగా మాంగళ్యధారణ ఘట్టం

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

దామరచర్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, పేదలకు వ్యతిరేకంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ దేశ సంపదను కార్పొరేట్ శక్తులు దోచుకునే విధంగా ఉందే తప్ప కోట్లాది మంది భారతీయులకు ఉపయోగపడే విధంగా లేదన్నారు. పేదలనుంచి అత్యధికంగా వసూలు చేసిన జీఎస్టీ బిల్లులు కార్పొరేట్ శక్తులకు అప్పజెప్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచలేదని, రైతులకు ఉపయోగపడే కనీస మద్దతు ధర ఊసే లేదన్నారు. సంపద సృష్టి మూలమైన సంఘటిత, అసంఘటితరంగ కార్మికులకు రక్షణలేని బడ్జెట్‌గా ఉందన్నారు. విద్యా, వైద్యానికి నిధులు ఆశాజనకంగా లేవన్నారు. వెంటనే కేంద్రం బడ్జెట్‌ను సవరించి పేదలకు ఉపయోగకరంగా ఉండేవిధంగా చూడాలని, లేదంటే పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, వినోద్‌నాయక్, పాపానాయక్, దయానంద్, ఎర్రనాయక్, కోటిరెడ్డి, ఖాజా మొహినొద్దిన్, సుబాని, దుర్గయ్య, శాంతమ్మ, చంద్రకళ, మట్టయ్య పాల్గొన్నారు.

త్వరలో చెక్‌పోస్టులు ప్రారంభిస్తాం

- రూ.15 కోట్లతో చాకలిగట్టు అభివృద్ధి
- జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్
- పలు చెక్ పోస్టుల పరిశీలన

7



బీసీల హవా

- స్థానిక సంస్థల్లో అధికసంఖ్యలో సీట్ల కైవసం
- గత ఎన్నికల్లో సత్తా చాటిన బీసీ నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో బీసీ రిజర్వేషన్ల అంశం రాజకీయాలను కుదిపేస్తోంది. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించే అంశంపై అధికార, ప్రతిపక్షాల నడుమ ఎత్తులు, పైఎత్తులు సాగుతున్నాయి. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం స్థానిక సంస్థల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వడానికి ఆస్కారం లేనందున, బీసీలకు తమ పార్టీ తరపున 45శాతం సీట్లు కేటాయిస్తామని, బీఆర్ఎస్, బీజేపీ అందుకు సిద్ధం కావాలని అధికార కాంగ్రెస్ నాయకులు సవాలు విసురుతున్నారు.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

గత ఎన్నికల్లోనూ జనరల్ స్థానాల్లో పోటీచేసిన బీసీలు పలువురు విజయకేతనం ఎగురవేసి తమ సత్తా చాటారు. ఉమ్మడి జిల్లాలో పలువురు బీసీ నాయకులు గ్రామపంచాయతీ సర్పంచ్‌లుగా, ఎంపీటీసీ, జడ్పీటీసీలుగానూ జనరల్ స్థానాల్లో పోటీచేసి గెలుపొందారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జనరల్ స్థానాల్లో ఏడుగురు నాయకులు జడ్పీటీసీలుగా గెలుపొందితే, 90మంది ఎంపీటీసీలుగా, 190 మంది పంచాయతీ సర్పంచ్‌లుగా గెలుపొంది బీసీ జెండా ఎగరవేశారు. ఈసారి కాంగ్రెస్ నుంచి అధిక సీట్లు కేటాయిస్తే, అదే స్థాయిలో బీఆర్ఎస్, బీజేపీ, వామపక్షాల నుంచి సైతం అభ్యర్థిత్వాలు దక్కించుకొని సత్తా చాటేందుకు బీసీ నాయకులు సిద్ధమవుతున్నారు.

40శాతం పంచాయతీల్లో సర్పంచ్‌లుగా గెలిచిన బీసీలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2019లో చివరిసారిగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మొత్తం సర్పంచ్ పదవుల్లో 40శాతం బీసీ సామాజికవర్గాల నాయకులు గెలుపొందారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,730 గ్రామ పంచాయతీలకు 687 పంచాయతీల్లో సర్పంచ్‌లుగా బీసీనేతలు గెలుపొందారు. 497 గ్రామపంచాయతీ సర్పంచ్ పదవులు బీసీలకే రిజర్వ్ కాగా, మరో 190 జనరల్‌స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులు పోటీపడి గెలుపొందారు. జనరల్ స్థానాల్లో నల్లగొండ జిల్లాలో 79 మంది, సూర్యాపేటలో 52మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 59 మంది సర్పంచులుగా విజయం సాధించారు. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లోనే జనరల్‌స్థానాల్లో ఎక్కువమంది బీసీలు సర్పంచ్‌లుగా గెలుపొందారు.

ఎంపీటీసీ స్థానాల్లో 35శాతం దక్కించుకున్న బీసీలు

ఉమ్మడి జిల్లాలో మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ స్థానాల్లోనూ జనరల్ కేటగిరీలో బీసీలు గణనీయంగా సీట్లు దక్కించుకున్నారు. మొత్తం సీట్లలో 35శాతం బీసీలు గెలుపొందారు. మొత్తం ఉమ్మడి జిల్లాలో 718 ఎంపీటీసీ స్థానాలకు 251మంది బీసీ నాయకులు విజయం సాధించారు. ఇందులో బీసీ రిజర్వేషన్ స్థానాలు 161 అయితే, మిగిలిన 90 జనరల్ సీట్లలో బీసీలు గెలుపొందారు. జనరల్ కేటగిరీలోని ఎంపీటీసీ స్థానాల్లో అత్యధికంగా సూర్యాపేట జిల్లాలో 50మంది, నల్లగొండలో 28 మంది, యాదాద్రి భువనగిరిలో 12మంది ఎంపీటీసీగా గెలిచారు.

జడ్పీటీసీ స్థానాల్లో 25శాతం సీట్లలో విజయం

జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులుగా మాత్రం బీసీనాయకులు

మిగతా 7వ పేజీలో

రూ.196.51 కోట్లు

● రైతు భరోసాకు వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు



నల్లగొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మరోసారి రైతుభరోసా నిధులను విడుదల చేయడానికి బుధవారం జిల్లా వ్యవసాయ అధికారులనుంచి వివరాలను సేకరించింది. అధికారులు నల్లగొండ జిల్లాలో 1,55,232 మంది రైతులకు రూ.88,48,08,319, సూర్యాపేట జిల్లాలో 96,473 మంది రైతులకు రూ.61,58,62,090, యాదాద్రి భువనగిరి జిల్లాలో 78,795 మంది రైతులకు రూ.46,44,93,195 మొత్తంగా ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా రూ.196,51,63,604 నిధులకు ప్రతిపాదనలు పంపారు. అయితే బుధవారం నుంచి ఎకరంలోపు రైతుల ఖాతాల్లో జమ అవుతుండగా, మిగతా వారికి ఒకటిరెండు రోజుల్లో పూర్తి కానున్నాయి. గత నెల 26న ప్రభుత్వం మండలానికి ఓ గ్రామం చొప్పున ఎంపికచేసి అదేరోజు నూటికి నూరు శాతం రైతులకు రైతు భరోసా సాయం అందజేసిన విషయం తెలిసిందే. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ కొనసాగింపు పథకం కాబట్టి నిధుల జమకు ఎలాంటి ఆటంకం లేదని సమాచారం. అయితే మిగతా రైతులందరికీ కూడా వరుసగా రైతు భరోసా నిధులు చెల్లిస్తారా? లేదంటే మళ్లీ మధ్యలో నిలిపివేసి ఆ తర్వాత చెల్లిస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.

వివాహాది శుభకార్యాలకు ఆర్టీసీ బస్సులు

- పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు అద్దెకు ఇచ్చేందుకు నిర్ణయం
- కిలోమీటర్‌కు రూ.7తగ్గిస్తున్నట్లు తెలిపిన అధికారులు



7

నక్షా.. మునిసిపల్ ఆస్తులకు రక్ష

- ప్రజల ఆస్తులు పక్కాగా డ్రోన్‌లతో చిత్రీకరణ
- శాటిలైట్‌తో అనుసంధానం



6

ఎస్సీ వర్గీకరణ తీర్మానాన్ని హర్షిస్తూ..



8

వర్గీకరణను ఉపసంహరించుకోవాలి

● మాల మహానాడు ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



జిల్లాకేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నల్లగొండ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): శాసనసభ, శాసన మండలిలో ఎస్సీ వర్గీకరణను ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించడాన్ని మాల, మహానాడు ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో బుధవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఎలాంటి ప్రామాణికం లేకుండా జనాభా లెక్కలు తీసుకుని వర్గీకరణ చేయడం విచారకరమన్నారు. రాష్ట్రంలో ఎస్సీల మొత్తం జనాభా 62లక్షలు చూపించి వర్గీకరణలో మాత్రం 51లక్షల జనాభాను మూడు విభాగాలుగా చూపించారని ఆరోపించారు. ఇందులో 10లక్షల మాలల జనాభాను తక్కువగా చూపించారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే వర్గీకరణ విషయాన్ని ఉపసంహరించుకోవాలని, లేదంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ స్టీరింగ్ కమిటీ సభ్యుడు గోలి సైదులు, విజయ్‌కుమార్, యాదగిరి, రవి, విజయ్, రామకోటి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా కులగణన సర్వే

● బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న చక్రహరి రామరాజు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన తప్పుల తడకగా మారిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు అన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర కులగణనలో బీసీలు రాష్ట్రంలో 46శాతం ఉన్నారని ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాకేంద్రంలోని బీసీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో మాట్లాడారు. ఇప్పటివరకు భారతదేశంలో జరిగిన సర్వేలన్నింటిలో బీసీలు 50శాతానికి పైగానే ఉన్నట్లు చూపించారు కానీ, ఈ సర్వే ప్రకారం రాష్ట్రంలో బీసీలు 46 శాతమే ఉన్నారని చూపడం దారుణమన్నారు. గ్రామాల్లో అత్యధికంగా ఉండేది బీసీలు మాత్రమేనని, కానీ వారి శాతం ఎలా తగ్గిందని ప్రశ్నించారు. సర్వే సమగ్రంగా జరగకపోవడమే దీనికి కారణమన్నారు. నల్లగొండలోనే చాలా మంది తమ కుటుంబాలను సర్వే చేయించలేదని చెప్పారని, అదేవిధంగా హైదరాబాదులో సగం మందికి పైగా ఈ సర్వేలో పాల్గొనలేదన్నారు. దీనికి ప్రభుత్వం ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణమన్నారు.

చాలా మంది సర్వేలో పాల్గొనలేదు

సర్వేలో ప్రభుత్వం 57 రకాల వివరాలను అడగడంతో చాలామంది భయపడి కూడా ఈ సర్వేలో పాల్గొనలేదని చక్రహరి రామరాజు అన్నారు. 2014లో గత ప్రభుత్వం ఒక్కరోజులో జరిపిన కుటుంబ సర్వేలో ముంబై వంటి ఇతర రాష్ట్రాల్లో ఉన్నవారు వచ్చి పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వం ఈ సర్వే నివేదికను ప్రజల ముందు ఉంచాలని, ప్రతీ గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, ప్రతి వార్డులో అదే విధంగా హైదరాబాదులో వివిధ ప్రాంతాల్లో ఎవరెవరు సర్వేలో పాల్గొన్నారో వారి జాబితా ప్రకటించాలన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ సర్వేను పునః సమీక్ష జరిపి కేవలం కులగణన మాత్రమే జరిపి ఖచ్చితమైన బీసీల లెక్కలను తేల్చాలన్నారు. బీసీల డిమాండ్లను నెరవేర్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే బీసీలంతా తిరుగుబాటు చేస్తారన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు కాసోజు విశ్వనాథం, గౌరవ అధ్యక్షుడు కంది సూర్యనారాయణ, సీనియర్ ఉపాధ్యక్షుడు కేశబోయిన శంకర్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు నకరకంటి కాశయ్య గౌడ్, గోలి విజయకుమార్, ఆదినారాయణ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

● కేంద్ర పాపులేషన్ రీసెర్చ్ సెంట్రల్ బృందం సభ్యుడు డాక్టర్ రంజిత్



డాక్టర్లతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

మర్రిగూడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో ఉన్న రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కేంద్ర పాపులేషన్ రీసెర్చ్ సెంట్రల్ బృందం సభ్యుడు డాక్టర్ రంజిత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. డాక్టర్ల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారులు దూర ప్రాంతాల నుంచి వచ్చి రోగులకు సేవలు అందించడం బాగుందన్నారు. అదేవిధంగా ఆస్పత్రిలో ఎంతమంది వైద్యులు ఉన్నారు?, సిబ్బంది కొరత ఉందా? అని డాక్టర్ శాలినిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కల్యాణ్ చక్రవర్తి, జీవోఐ డాక్టర్ కార్తీక్, రీసర్చ్ ఆఫీసర్ దేవరాజు, పీహెచ్‌సీ మర్రిగూడ డాక్టర్ శంకర్, మెడికల్ ఆఫీసర్ కల్యాణ్ పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి తాగినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని షీ టీమ్ సీఐ కోట కరుణాకర్ అన్నారు. డ్రగ్స్‌పై పట్టణంలోని ఇండియన్ రెడ్ క్రాస్ భవన్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. గంజాయి వాడినా, రవాణా చేసినా వారికి పదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధించనున్నట్లు తెలిపారు. యువత చెడుదారి పట్టకుండా ఉండాలంటే కుటుంబంతో ఎక్కువ సమయం కేటాయించాలన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు డ్రగ్ కిట్ అందజేసినట్లు తెలిపారు. ఆ కిట్‌తో పరీక్ష నిర్వహిస్తే 22 రకాలు డ్రగ్స్ బయటపడతాయని పేర్కొన్నారు. సమావేశంలో ఎక్సైజ్ ఎస్ఐ విజయ్‌కుమార్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ యూత్ కోఆర్డినేటర్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి, నెహ్రూ యువ కేంద్రం అధికారి ప్రవీణ్‌సింగ్, పెరిక సంపత్ కుమార్, కొండనాయక్, ప్రసాద్, బాబురావు పాల్గొన్నారు.

చేయూతనిచ్చి.. భరోసా కల్పిస్తూ

● మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయాలకు మినీ సరస్ ఫెయిర్ ● ఆకట్టుకుంటున్న హస్తకళలు, ఆహార ఉత్పత్తులు, చేనేత దుస్తులు ● 8వ తేదీ వరకు నిర్వహణ



ప్రదర్శనలో ఏర్పాటు చేసిన బ్యాగులు, వస్తువులు

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్(పేదరిక నిర్మూలన సంస్థ) సంయుక్తంగా రాష్ట్రం లోనే తొలిసారి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మహిళా సంఘాల ఉత్పత్తులను నల్లగొండ జిల్లాకేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రదర్శనకు ఏర్పాటుచేశారు. 'మినీ సరస్ ఫెయిర్- 2025' పేరిట ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శన మహిళలు, యువతులను ఆకట్టుకుంటోంది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వారి ఉత్పత్తులను ప్రపంచం దృష్టిని ఆకర్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తుల్లో వారి కుటుంబసభ్యులు కూడా భాగస్వాములవుతున్నారు. గ్రామీణ స్వయం సహాయ సంఘాల మహిళలు జాతీయ స్థాయి వ్యాపారవేత్తలుగా ఎదగాలనే లక్ష్యంతోనే ఈ ఫెయిర్‌కు శ్రీకారంచుట్టారు. ఈ నెల 4వ తేదీన ప్రారంభమైన మినీ సరస్ 8వ తేదీ వరకూ కొనసాగనుంది. మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులన్నీ ప్రదర్శనల ద్వారా విక్రయిచడంతో పాటు ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ చేయడం కోసం కార్యాచరణ రూపొందించారు.

42 స్టాళ్లు ఏర్పాటు

ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయిలో మొత్తం 42 స్టాల్స్ ఏర్పాటుచేశారు. నల్లగొండ జిల్లా నుంచి గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి 30 స్టాల్స్ ఏర్పాటయ్యాయి. సూర్యాపేట జిల్లా నుంచి ఆరు, యాద్రాద్రి జిల్లా నుంచి ఆరు స్టాల్స్ ఏర్పాటుచేశారు. వీటిలో అద్భుతమైన హస్తకళలు, ఆహార ఉత్పత్తులు, చేనేత ప్రదర్శనలు, మట్టి పాత్రలను విక్రయిస్తున్నారు. దేవరకొండ ప్రాంతంలోని గిరిజన మహిళలు తయారు చేసిన హెర్బల్ ఉత్పత్తులు, పూసల వస్తువులు, ఎంబ్రాయిడరీ వర్క్స్ మహిళలను ఆకట్టుకుంటున్నాయి. అధికారులు ప్రత్యేకంగా వారికి శిక్షణ ఇవ్వడంతో పాటు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించడం కోసం ఈ కార్యక్రమం చేపట్టడంపై మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. స్టాల్స్‌లో పెట్టిన పచ్చళ్లు కూడా ఎంతో రుచికంగా ఉన్నాయని స్టాల్స్‌ను సందర్శించిన ప్రజలు అభినందిస్తున్నారు.



గిరిజన ఉత్పత్తులతో స్టాల్ నిర్వాహకులు



మట్టి పాత్రలను పరిశీలిస్తున్న మహిళలు

మహిళా సంఘాలకు ప్రభుత్వం చేయూత



రాష్ట్ర ప్రభుత్వంతో పాటు గ్రామీణాభివృద్ధి, సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు చేయూత అందిస్తోంది. మినీ సరస్ ఫెయిర్‌ను ఉమ్మడి నల్లగొండ జిల్లాకే పరిమితం చేయకుండా రాష్ట్ర, జాతీయ స్థాయికి విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. మహిళలు కేవలం జిల్లా స్థాయిలో వ్యాపారానికి పరిమితం చేయకుండా వారికి పెట్టుబడులు కూడా రుణాలు కూడా అందించి వారిని వ్యాపార వేత్తలుగా తీర్చిది ద్దడం కోసం పకడ్బందీగా మినీ సరస్ ఫెయిర్‌ను తీర్చిదిద్దారు. టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ప్రతిరోజూ ఉదయం 9.30గంటల నుంచి రాత్రి 9.30గంటల వరకు నిర్వహిస్తున్నారు. నల్లగొండ పట్టణవాసులే కాకుండా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు తరలి వస్తున్నారు.

అధికారులు ప్రోత్సహిస్తున్నారు



బంజార ఉత్పత్తులు తయారుచేయడానికి అధికారులు ప్రోత్సహిస్తున్నారు. అందమైన బ్యాగులు, అద్దాలతో అలంకరించిన వస్త్రాలు తయారుచేస్తున్నాం. ఎంబ్రాయిడరీ వర్క్ ఉత్పత్తులకు మంచి ఆదరణ ఉంది. కుటుంబసభ్యులు కలిసి పనిచేస్తాం. అధికారులు, ప్రభుత్వ ప్రోత్సాహం ఉంది. సరస్ ఫెయిర్ ప్రదర్శనలో మా ఉత్పత్తులు ఆకర్షణగా నిలుస్తున్నాయి.

● ముడావత్ గాడి, శ్రీశివుడు బంజారా మహిళా సంఘం దేవరకొండ

చేనేతకు చేయూత లభిస్తుంది



చేనేత రంగానికి చేయూత లభిస్తోంది. తొమ్మిదేళ్లుగా ఈ వృత్తిలో ఉన్నా. కుటుంబసభ్యుల ప్రోత్సాహం ఉంది. మెప్మా సహకారంతో ముందుకు సాగుతున్నాం. మొదటిసారిగా స్టాల్ ఏర్పాటు చేయడం ఎంతగానో సంతోషంగా ఉంది. ప్రజల నుంచి కూడా ఆదరణ ఉంది. మహిళలు ఇంటికే పరిమిత కాకుండా స్వశక్తితో ఎదగాల్సిన అవసరం ఎంతగానో ఉంది.

● ఏలె స్మృతి, స్వశక్తి మహిళా సంఘం నల్లగొండ.

పూసలతో బ్యాగులను తయారు చేస్తున్నాం



మా సంఘం ఆధ్వర్యంలో పూసలతో బ్యాగులు, పర్సులు తయారుచేస్తున్నాం.ధరలు అందరికీ అందుబాటులో ఉండడంతో కొనుగోళ్లు అధికంగా జరుగుతున్నాయి. అధికారుల ప్రోత్సాహంతో సంఘాలు అభివృద్ధి చెందుతున్నాయి. పూసలతో చేసిన బ్యాగులు, పర్సులు ఆకట్టుకుంటున్నాయి. మేము తయారు చేస్తున్న ఉత్పత్తుల కొనుగోళ్లతో ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తాం.

● ఎం. అనిత, శివసాయి సమభావన సంఘం తిప్పర్తి.

ఉమ్మడి జిల్లాలో దొంగల హల్‌చల్

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దొంగలు హల్‌చల్ చేశారు. పలు ఇళ్లలో దొంగతనాలు చేసి నగదు, ఆభరణాలు ఎత్తుకెళ్లారు. యాదాద్రిభువనగిరి జిల్లా మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామంలో మంగళవారం రాత్రి రెండు ఇళ్లల్లో దొంగలు ఇంటి తాళాలు విరగ్గొట్టి బీరువాలోని నగలు, డబ్బులు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జలాల్‌పూర్ గ్రామంలోని బండ బాల్‌రెడ్డి రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లారు. దొంగలు మంగళవారం రాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువా పగలగొట్టి అందులోని రూ.70వేలు నగదు, తులం బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. ఇదే గ్రామానికి చెందిన కొయ్యడ భరత్ ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. దొంగలు ఇంటి తాళం విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని తులం బంగారు చైన్‌ను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుమేరకు చౌటుప్పల్‌రూరల్ సీఐ రాములు, భూదాన్‌పోచంపల్లి ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి సంఘటనా స్థలాలకు చేరుకుని చోరీలపై ఆరాతీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దేవరకొండ: నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని హనుమాన్ నగర్‌లో దొంగలు బుధవారం పట్టపగలే ఓ ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేశారు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం... హనుమాన్‌నగర్‌లో నివసించే రాఘవచారి బంగారం షాపులో పని చేస్తుంటాడు. బుధవారం ఉదయం దుకాణానికి వెళ్లగా, ఆయన భార్య హైదరాబాద్‌కు వెళ్లింది. రాఘవచారి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. దొంగతనం జరిగిందని నిర్ధారించుకొని బీరువా తెరిచి చూడగా బీరువాలో ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. రాఘవచారి బుధవారం సాయంత్రం దేవరకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కోదాడ రూరల్: సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని అడ్లూరు కాలనీలో మంగళవారం రాత్రి ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి దేహశుద్ధి చేసి గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తులశమ్మ ఊర్లో లేని సమయంలో ఇంటికి తాళం వేసి ఉండడంతో ఇద్దరు దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి, బీరువా పగులగొట్టి చోరీ చేసేందుకు ప్రయత్నించారు. పక్కన ఇళ్ల వారు గమనించి వెంటనే దొంగలు పట్టుకున్నారు. ఒకరు పారిపోగా, మరొకరికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

ఇంటికి చేరిన పర్వతారోహకురాలు అన్విత



శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అన్విత

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఏడు ఖండాల్లో ఏడు శిఖరాలు లక్ష్యసాధనలో భాగంగా దక్షిణ అమెరికా అర్జెంటీనాలోని సముద్ర మట్టానికి 6,961 మీటర్ల ఎత్తయిన అకాంగోవా పర్వతాన్ని అధిరోహించిన పడమటి అన్విత బుధవారం భువనగిరికి చేరుకున్నారు. లక్ష్యసాధనకు జనవరి 10న భువనగిరి నుంచి ప్రయాణమైన ఆమె 13న పర్వతారోహణను ప్రారంభించి గణతంత్ర దినోత్సవం 26న అకాంగోవా పర్వత శిఖరాగ్రాన్ని చేరుకొని జాతీయ పతాకాన్ని సగర్వంగా ప్రదర్శించింది. అదేరోజు తిరుగు ప్రయాణమైన ఆమె పది రోజుల తర్వాత బుధవారం భువనగిరిలోని ఇంటికి చేరింది. తల్లిదండ్రులు పడమటి మధుసూదన్‌రెడ్డి, చంద్రకళ, ట్రాన్సెండ్ అడ్వెంచర్ ఎండీ బి. శేఖర్‌బాబు, మేనేజర్ రాకేష్ తదితరులు శంషాబాద్ విమానాశ్రయంలో ఆమెకు స్వాగతం పలికారు.

మోటారు వైర్లు చోరీ

సూర్యాపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండల పరిదిలోని ఎర్రపహాడ్ గ్రామ శివారులో గల 365 జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న రైతుల వ్యవసాయ బోరు బావులకు ఉన్న విద్యుత్ కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బుధవారం రైతులు తెలిపిన వివరాల ప్రకారం రాత్రి సమయంలో స్టార్టర్ నుంచి బోరు వరకు ఉన్న కేబుల్ వైర్లను కోసి తీసుకెళ్లారని రైతులు తెలిపారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.గత నెలలో కూడా ఎర్రపహాడ్ నుంచి బికుమళ్ల వరకు వైర్లు కోసి ఎత్తుకెళ్లారు.

34 ఏళ్లుగా సైకిల్‌పై సవారీ

● ఉద్యోగంలో చేరినప్పటి నుంచి సైకిల్‌పైనే పోస్టుమన్‌గా



ఆత్మకూరు(ఎం) ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన ఎండీ. ఫారూఖ్ తపాలశాఖలో ఈడీఎంసీ(పోస్టుమన్)గా విధులు నిర్వహిస్తున్నారు. 34 ఏళ్ల నుంచి సైకిల్ వాడుతున్నాడు. మండల కేంద్రానికి చెందిన ఫారూఖ్ 1991లో తపాలశాఖలో ఉద్యోగంలో చేరారు. అదే సంవత్సరంలో రూ.500లతో సైకిల్ కొనుగోలు చేశారు. నేటికీ అదే సైకిల్ వాడుతున్నారు ఫారూఖ్. ప్రతిరోజూ ఆత్మకూరు నుంచి పల్లెర్ల, కూరెళ్ల గ్రామాలకు పోస్టులు తీసుకెళ్తారు. ఉద్యోగ రీత్యా రోజూ 24కిలో మీటర్లు సైకిల్‌పై ప్రయణిస్తారు. ఎంత ఎండ ఉన్నా, వర్షాకాలంలో కూడా తన సైకిల్‌పై విధులకు వెళ్తారు. 34ఏళ్లుగా రోజు 24కిలోమీటర్లు సైకిల్ తొక్కుతున్న ఫారూఖ్ ఓపికను పలువురు అభినందిస్తున్నారు. 'బైక్, మోపెడ్‌పై వెళ్లాలంటే నాకు భయం అందుకే సైకిల్ పైనే వెళ్తాను' అని ఫారూఖ్ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

తిప్పర్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు కుక్కను ఢీకొని కింద పడి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని కేశరాజుపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మేకల మహేష్(25) తన ద్విచక్ర వాహనంపై బయలుదేరి మిర్యాలగూడెం రోడ్డులోని తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ప్రగతి ఎన్‌క్లేవ్ వద్దకు చేరుకోగానే ఓ కుక్క వేగంగా వచ్చి తగలడంతో బైకు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఎలక్ట్రికల్ పోల్‌కి ఢీ కొట్టడంతో మహేష్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మహేష్ చిన్నమ్మ వనపర్తి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ యాదయ్య తెలిపారు. మహేష్ తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కుమారుడు. తండ్రి అనారోగ్యంతో మృతిచెందగా, తల్లి వరమ్మ అనారోగ్యంతో ఉంది.

వలిగొండ: రైలుకింద పడి వ్యక్తి మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం టేకులసోమారం గ్రామానికి చెందిన నారగోని సైదులు (38) వృత్తిరీత్యా గీత కార్మికుడు. బుధవారం సాయంత్రం గుర్తుతెలియని రైలుఢీకొని మృతిచెందాడు. అతని మృతికి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సైదులుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

జాతీయ రహదారిపై ఆటో దగ్ధం



నార్కట్‌పల్లి శివారులో దగ్ధమైన ఆటో

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కోసం తీసుకెళ్తున్న ఓ ఆటో టైర్లకు నిప్పు రాజుకుని దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.2.50 లక్షల విలువైన ఆస్తి నష్టం సంభవించింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి శివారులో బుధవారం సాయంత్రం జరిగింది. బాధితుడు రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రవీందర్ నల్లగొండలోని టాటా ఫైనాన్స్‌లో సీజ్ అయిన టాటీ ఏసీ ఆటోను రూ.2.50లక్షలకు కొనుగోలు చేశాడు. దానికి మరమ్మతులు చేయించాల్సి ఉండటంతో తన కారుకు సైకిల్ టైర్లను టోచెన్‌గా కట్టి హైద్రాబాద్‌లోని ఆటోనగర్‌కు తీసుకెళ్తున్నాడు. ఆటోలో ఎజాజ్ అనే డ్రైవర్ కూర్చున్నాడు. ఎండ వేడిమి ఎక్కువగా ఉండటం వల్ల సైకిల్ టైర్ల మధ్య రాపిడి జరిగి సైకిల్ టైర్లకు నిప్పు రాజుకుంది. గమనించి కిం దకు దిగి నిప్పును ఆపే ప్రయత్నం చేస్తుండగానే మంటలు ఆటోకు అంటుకొని దగ్ధమైంది. ఆటోతో పాటు కారు కూడా ప్రమాదానికి గురికాకుండా వెంటనే అప్రమత్తమై కారుకు టోచెన్‌గా కట్టిన సైకిల్ టైర్లను తొలగించానని చెప్పాడు.

విద్యుత్ వైరు తగిలి..



గోపి (ఫైల్)

కనగల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని జీఎడవల్లిలో బుధవారం జరిగింది. హెడ్ కానిస్టేబుల్ రషీద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మన్నెం గోపి(32) ఉదయం 11గంటల సమయంలో గ్రామ శివారులోని వ్యవసాయ భూమి వద్ద గల బోరు మోటర్‌ను ఆన్‌చేస్తున్న సమయంలో స్టాటర్ వద్ద తెగి ఉన్న విద్యుత్ తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అక్కడే పొలం వద్ద ఉన్న అతని తండ్రి మన్నెం యాదయ్య గమనించి వెంటనే చికిత్స నిమిత్తం గోపిని 108వాహనంలో నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. ఆసుపత్రికి వచ్చేలోపే గోపి మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

చికిత్సపొందుతూ వృద్ధుడు..



మాడ్గులపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కన్నెకల్ గ్రామానికి చెందిన జొన్నలగడ్డ వెంకట్ రాంరెడ్డి(85) రెండు సంవత్సరాల క్రితం భార్య రాములమ్మ మృతిచెందగా ఒంటరిగా జీవిస్తున్నాడు. మోకాళ్ల నొప్పితో బాధపడుతున్న వెంకట్‌రాంరెడ్డి ఈ నెల 4న తన ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగాడు. గమనించిన వెంకట్‌రాంరెడ్డి అన్న కొడుకు జొన్నలగడ్డ బంగార్‌రెడ్డి చికిత్సనిమిత్తం నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాడు. చికిత్సపొందుతూ బుధవారం వెంకట్‌రాంరెడ్డి మృతిచెందాడు. చిన్న కూతురు జూలకంటి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

అదుపు తప్పి దుకాణంలోకి దూసుకెళ్లిన కారు



బీబీనగర్ బైపాస్ రోడ్డులో దుకాణంలోకి దూసుకెళ్లి బోల్తాపడిన కారు

బీబీనగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి రోడ్డు పక్కన షాపులోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలో బుధవారం జరిగింది. పట్టణంలోని దాసరివాడకు చెందిన బి. రాజు సర్వీసు రోడ్డులో కారును నడిపే ప్రయత్నంలో అదుపు తప్పి రోడ్డు పక్క న ఉన్న బాలాజీ ఎలక్ట్రికల్, హార్డ్‌వేర్ షాపులోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో షాపు యజమాని యేమంతు చౌదరి గాయపడ్డాడు. షాపు ముందు పార్కు చేసిన రెండు ద్విచక్ర వాహనాలు, పేయింట్ డబ్బాలు ధ్వంసమయ్యాయి.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మద్దిరాల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల పరిధిలోని పాలేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ వీరన్న తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా మరిపెడబంగ్లా మండలం తానంచర్ల గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ అజ్మీర శివ బుధవారం అక్రమంగా ఇసుకను నింపుకొని వెళ్తుండగా పోలీసులు మార్గమధ్యలో పట్టుకున్నారు.

నక్షా.. మునిసిపల్ ఆస్తులకు రక్ష

● శాటిలైట్ సర్వేతో పట్టణ నక్షా ● ప్రజల ఆస్తులు పక్కాగా డ్రోన్‌లతో చిత్రీకరణ ● శాటిలైట్‌తో అనుసంధానం పైలెట్ ప్రాజెక్టుగా మిర్యాలగూడ మునిసిపాలిటీ

సాగు భూములకు పక్కాగా నక్షా ఉండే మాదిరిగా పట్టణాలకు కూడా రూపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైలెట్ సర్వే చేపట్టాయి. కాగితాలపై పేర్కొన్న వివరాలకు క్షేత్రస్థాయిలో ఉన్న భూముల వివరాలకు పొంతన లేకుండాపోతోంది. ఆస్తులు ఒకరివి అయితే అనుభవం మరొకరిదిగా ఉంటోంది. ప్రభుత్వ భూముల కబ్జాలకు అంతే లేకుండా పోతోంది. గతంలో రెవెన్యూ, మునిసిపల్ అధికారుల సర్వేల ప్రకారం రూపొందించిన మ్యాపుల్లో సైతం తేడాలు ఉంటున్నాయి.

● ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ

పట్టణ నక్షాను పక్కాగా రూపొందించేందుకు డ్రోన్‌లను శాటిలైట్‌కు అనుసంధానించి ఇంటింటి సర్వేను చేసి కట్టడాల, వ్యవసాయ భూముల, చెరువుల లెక్కలు తీసేందుకు దేశ వ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టు కింద వంద పట్టణాలను ఎంపిక చేశారు. రాష్ట్రంలో 10 మునిసిపాలిటీలను ఎంపిక చేయగా, అందులో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మునిసిపాలిటీ కూడా ఉంది. మార్చి 1వ తేదీ నుంచి సర్వే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నేషన్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (ఎన్‌ఏకేఎస్‌హెచ్‌ఏ -నక్షా) పథకం కింద సర్వే ఆఫ్ ఇండియా, మునిని పాలిటీ, ల్యాండ్ సర్వే, డ్యాకుమెంట్ మేనేజ్‌మెంట్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా మిర్యాలగూడ మున్సిపాలిటీలో సర్వే చేపట్టను న్నాయి. ఇందుకు సంబంధించి అధికారులతో కూడిన 14 బృందాలను వినియోగించనున్నారు. నివాసాలు ఎక్కువగా ఉన్న 10 ఎకరాల పరిధిలో క్లోజ్ సర్క్యూట్‌గా, 40 ఎకరాలలోపు మీడియం క్లోజ్‌గా, 160 ఎకరాలలోపు ఓపెన్ సర్వేగా మూడు భాగాలుగా విభజించి సర్వే చేపట్టనున్నారు. ఇందుకు బేస్డ్ ప్రాంతాలను గుర్తించేందుకు సర్వే నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఆర్‌వి అసోసియేట్స్ ఏజెన్సీ సిబ్బందితో కలిసి అధికారులు స్థలాలను పరిశీలించారు. సర్వే బృందాలకు శిక్షణ ఇస్తున్నందున శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే మార్చి 1వ తేదీ నుంచి మూడు నెలల పాటు సర్వే చేసి హద్దులు నిర్ణయించనున్నారు.



మిర్యాలగూడ పట్టణ వ్యూ

250 మీటర్ల బఫర్ జోన్

మిర్యాలగూడ, నందిపాడు, హైదాలపురం, వెంకటాద్రిపాలెంలో (కొంత భాగం) గ్రామాలతో కలిపి మిర్యాలగూడ మునిసిపాలిటీ విస్తీరణం 28.5 కిలోమీటర్ల విస్తీరణం కలిగి ఉంది. సుమారు 1.50లక్షల జనాభా కలిగిన మున్సిపాలిటీలో 48వార్డులు, 26,110 భవనాలు ఉన్నాయి. నక్షాతో మునిసిపాలిటీ చుట్టూ అదనంగా 250మీటర్ల మేర బఫర్ జోన్‌గా ప్రకటించనున్నారు. సుమారు 600నుంచి 800 మీటర్ల ఎత్తు నుంచి డ్రోన్ల సహాయంతో ఫొటోలు తీసి వాటిని రికార్డుల ప్రకారం పరిశీలించి క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్ధారిస్తారు. నక్షా పథకంలో ప్రతి ఇంటినీ, ఆస్తినీ, ప్రభుత్వ భూములు, చెరువులు, రోడ్లు, డ్రైనేజీలతో సహా పక్కాగా సర్వేచేసి హద్దులు నిర్ణయించి విస్తీర్ణాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేస్తారు.

సర్వేకు చర్యలు చేపడుతున్నాం



నక్షా సర్వేకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా ల్యాండ్ సర్వే ఏడి శ్రీనివాసులు తెలిపారు. డ్రోన్‌సర్వే కోసం బేస్ స్థలాల ఎంపిక చేసేందుకు సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ పి. రమణయ్య, తహసీల్దార్ హరిబాబు, మునిసిపల్ కమిషనర్ యూసుఫ్, డీఈ వెంకన్నలతో కలిసి బుధవారం సర్వే ఏజెన్సీ సిబ్బందితో పట్టణంలో పర్యటించారు. నక్షా సర్వేతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులు పక్కాగా నమోదు చేస్తారని తెలిపారు. ప్రైవేట్ ఆస్తులు పక్కాగా నమోదైతే అక్రమాలకు తెర పడుతుందన్నారు. ఆస్తుల ప్రకారమే ప్రజలు ఆస్తిపన్ను చెల్లించవచ్చని తెలిపారు. పన్ను వసూళ్లలో సిబ్బందికి ఇబ్బందులు తొలగుతాయన్నారు. సర్వే అనంతరం ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయంతో ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని అన్నారు. సుమారు మూడు నెలల్లో సర్వే పూర్తి చేయడంతో పాటు సర్వే పూర్తయినట్లు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నక్షాను రిజిస్ట్రేషన్ శాఖకు అనుసంధానించనున్నట్లు తెలిపారు.

నేత్రపర్వం.. రామలింగేశ్వరుని కల్యాణం

● చెర్వుగట్టుకు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

● తలంబ్రాలు సమర్పించి మొక్కుల చెల్లింపు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హర హర మహాదేవ, శంభోశంకర.... ఓం నమఃశివాయ అంటూ భక్తుల ప్రణవ పంచాక్షరీ మంత్రం చెర్వుగట్టు ఇక్షుగిరులపై ప్రతిధ్వనిస్తూ... రుత్వికుల వేద మంత్రోచ్చారణలు...మంగళ వాయిద్యాలు కొండపై మారు మోగుతుండగా పార్వతీ జడల రామలింగేశ్వరుల కల్యాణ మహోత్సవం బుధవారం నేత్రపర్వంగా సాగింది. రథసప్తమి ఘడియల్లో తెల్లవారుజామున ఆది దంపతుల పరిణయ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ బుధవారం తెల్లవారుజామున స్వామివారి దివ్య కల్యాణం వైభవంగా జరిగింది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, పుష్ప దంపతులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఎన్నికలకోడ్ నేపథ్యంలో స్వామివారికి ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను ఎండోమెంట్ ఉత్సవ అధికారి కృష్ణ సమర్పించారు. యాజ్ఞీకుడు అల్లవరపు దీక్షితావధాని ఆచార్యత్వం, దేవస్థాన ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సహర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య బ్రహ్మ ముహూర్తంలో శివపార్వతుల కల్యాణం వేడుకగా సాగింది. ఈ సందర్భంగా భక్తులు తలంబ్రాలు బియ్యం సమర్పించేందుకు పోటీపడ్డారు. ఈ వేడుకలో నల్లగొండ ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బత్తుల ఊశయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, బండా సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, రేగట్టె నర్సిరెడ్డి, నేతకాని కృష్ణయ్య, నట్టు సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, గడుసు శశిధర్‌రెడ్డి, వారాల రమేష్, రేగట్టె నవీన్‌రెడ్డి, మల్ల శంకర్, సాగర్ల సైదులు, జెరిపోతుల భరత్, దొండ రమేశ్, దాసరి రాజు, ఈవో సిరికొండ నవీన్‌కుమార్, ఏ సీ భాస్కర్, ఎల్లారెడ్డిగూడెం మాజీ సర్పంచ్ కొండూరు శంకరయ్య, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో నార్కట్‌పల్లి సీఐ, ఎస్‌ఐలు నాగరాజు, క్రాంతికుమార్‌ల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

కల్యాణ కట్నాల ఆదాయం రూ.8,89లక్షలు

● తలంబ్రాల బియ్యం 40 టన్నులని అంచనా

చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరుని కల్యాణోత్సవం సందర్భంగా భక్తులు నగదు రూపంలో సమర్పించిన కట్నాల డబ్బులను లెక్కించారు. మొత్తం రూ. 8,89,445 ఆదాయం లభించింది. గతేడాదితో పోలిస్తే రూ.1,01,075లు తక్కువ. అదేవిధంగా భక్తులు సమర్పించిన తలంబ్రాల బియ్యం సుమారు 40 టన్నుల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.



శివోహం

కల్యాణమండపానికి స్వామివారి తీసుకొని వస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, ఆలయ సిబ్బంది, నాయకులు



కల్యాణతంతును నిర్వహిస్తున్న పండితులు

చెర్వుగట్టు మినీ శ్రీశైలం: ఎమ్మెల్యే వీరేశం

పార్వతీ జడల రామలింగేశ్వరుడు వెలిసిన చెర్వుగట్టు క్షేత్రం తెలంగాణ మినీ శ్రీశైలమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఇది ఎంతో ఆధ్యాత్మిక చరిత్ర గలిగిన ప్రాచీన దేవస్థానమని కొనియాడారు. స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వామివారి కృపతో రాష్ట్రం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షించారు.

● కల్యాణ మంటపం వద్ద ఇద్దరు మహిళా భక్తులు కల్యాణ మంటపానికి వెళ్లే ప్రవేశద్వారం వద్దకు చేరుకున్నారు. పోలీసులు వారిస్తున్నా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నిస్తూ వారితో వాగ్వాదానికి దిగారు. అయితే వారిని అక్కడి నుంచి పంపించే క్రమంలో మహిళా భక్తురాలని సదరు డ్యూటీలో ఉన్న ఎస్ఐ నెట్టేశాడు. ఈ వీడియో వైరల్‌గా మారింది.



తలంబ్రాల బియ్యం సమర్పించేందుకు వస్తున్న భక్తులు

వివాహాది శుభకార్యాలకు ఆర్టీసీ అద్దె బస్సులు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రీజియన్‌లోని అన్ని డిపోలలో వివాహాది శుభకార్యాలకు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సులు ఇవ్వనున్నట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా రీజనల్ మేనేజర్ కె.జానీరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రీజియన్‌లో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను అద్దెకు తీసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి కిలోమీటరుపై గతంలో కంటే రూ.7 తగ్గింపు ఉందని, 6 గంటల వెయిటింగ్ చార్జీ మినహాయింపు ఉంటుందన్నారు. ప్రైవేట్ వాహనాల కన్నా తక్కువ ధరలకు బస్సులు వస్తాయని, డ్రైవర్ బత్తా ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లతో పాటు సౌకర్యవంతమైన అధునాతన టెక్నాలజీ ఉన్న కొత్త బస్సులు చెప్పిన ఎన్ని గంటలకైనా అద్దెకు తీసుకోవచ్చని తెలిపారు. బస్సు బుకింగ్ చేసుకోవడానికి సమీప డిపోలను సంప్రదించాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు నల్లగొండ 99598 44918, సూర్యాపేట 7989225791, మిర్యాలగూడ 7382833790, కోదాడ 778043 3533, దేవరకొండ 7382833031, యాదగిరిగుట్ట 9885 103165, నార్కట్‌పల్లి 9848584198 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎంజీయూలో అధికారుల పదవీకాలం పొడిగింపు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న కొందరు అధికారుల పదవీ కాలాన్ని పొడిగించాలని, ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ సూచనల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షల నియంత్రణ అధికారిగా సేవలందిస్తున్న డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డిని మరో ఏడాది, ఐక్యూ ఏసీ డైరెక్టర్ డాక్టర్ మిరియాల రమేష్, ఆడిట్ సెల్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వై.జయంతిని మరో ఏడాది కొనసాగించనున్నారు. అంతేకాక డాక్టర్ జయంతిని కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

24నుంచి రాచకొండ దర్గా ఉర్సు

సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాచకొండ ఉర్సు ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఈనెల 24నుండి జరిగే ఉర్సు ఉత్సవాల కరపత్రాలను బుధవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఉర్సు ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ఉత్సవాల సందర్భంగా ఆప్రాంతంలో మౌలిక సదుపాయాలను కల్పిస్తామని పేర్కొన్నారు. దర్గా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎండీ.అక్బర్ అలీ, దర్గా మూతవాలి మహమ్మద్ ఇమ్రాన్, కె.శ్రీను నాయక్, కె.బిక్షపతి నాయక్, ముద్దంగుల నర్సింహ, ఏపూరి సతీష్, ఉప్పల లింగస్వామి, ఎండీ.రహీమ్ షరీఫ్, నయీమ్ షరీఫ్, సాధక్ కూరేసి, ఇలియాస్ పాల్గొన్నారు

వైభవంగా నమ్మాళ్వార్ పరమపదోత్సవం

● నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

● 10న స్వామివారి కల్యాణోత్సవం, 11న రథోత్సవం



భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో మూడో రోజు బుధవారం అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగాయి. ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు బృందం పురప్పాట్టు సేవ, తిరుమంజనం, దివ్య ప్రబంధ సేవాకాలం పాంచరాత్రాగమ రీతిలో వేడుకలను చేపట్టారు. సాయంత్రం పురప్పాట్టు సేవ, దివ్య ప్రబంధ సేవా కాలం పారాయణీకులు పఠించగా నమ్మాళ్వార్ పరమపదోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామిఅమ్మవారలను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో దివ్య మనోహరంగా అలంకరించి ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. వేడుకల్లో ఈవో ఏ.భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో దూశెట్టి క్రిష్ణ, ఉప ప్రధానార్చకుడు కొడకండ్ల మాధవచార్యులు, భట్టర్ సురేంద్రచార్యులు, పర్యవేక్షకుడు శంకర్‌నాయక్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



నమో నారసింహ

పాతగుట్ట ఆలయంలో పారాయణాలు చేస్తున్న అర్చకులు

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారలను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనార్చనలు జరిపారు. సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.14,13,557 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

నుంచి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పాతగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధి ఉత్సవ సంరంభాలకు సన్నద్ధమైంది. ఈ నెల 3వ తేదీనుంచి అధ్యయనోత్సవాలు ప్రారంభం 7వ తేదీ నుంచి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు స్వస్తి పుణ్యాహవాచనంతో ప్రారంభమవుతాయి. ఉత్సవాలలో ఫిబ్రవరి 9న రాత్రి స్వామివారి ఎదుర్కోలు, 10న తిరుకల్యాణం, 11న దివ్య విమాన రథోత్సవం జరుగుతుంది. 12వ తేదీన చక్రతీర్థం, పూర్ణాహుతి, 13వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకంతో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయి. ఈ ఉత్సవాలలో అత్యంత విశేషమైన స్వామివారి తిరుకల్యాణోత్సవం.. దివ్య విమాన రథోత్సవాలలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లను ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహ మూర్తి, అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

స్వామివారి వాహనాలు సిద్ధం

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాహన చేపట్టడం సంప్రదాయం. స్వామిఅమ్మవారలను విశేషంగా అలంకరణ చేసి వివిధ వాహనాలపై తిరువీధుల్లో ఊరేగిస్తారు. రుత్వికులు, పారాయణికులు పారాయణాలు పఠిస్తుండగా వివిధ రూపాల్లో స్వామివారు విహరిస్తారు. ఆలయంలో సింహ, హనుమంత, అశ్వ, గరుడ, శేష, గజ వాహనాలు సిద్ధం చేశారు.

వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం



పూర్వగిరి వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేశాం. స్వామివారి వాహన పూజలకు కావాల్సిన వాహనాలు, యాగశాల, ఆలయానికి ప్రత్యేక అలంకరణ చేశాం. బ్రహ్మోత్సవ కల్యాణ మండపం, ఆలయం రంగులు సర్వాంగసుందరంగా తీర్చిదిద్దా. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయగా అధికారులు, సిబ్బందిని అందుబాటులో ఉంచాం.

-ఈవో ఏ. భాస్కర్‌రావు (యాదగిరిగుట్ట, దేవస్థానం)

జనరల్ స్థానాల్లోనూ బీసీల హవా

(5వ పేజీ తరువాయి)

జనరల్ స్థానాల్లో పరిమితంగానే పోటీచేశారు. మండల స్థాయిలో నియోజకవర్గ ముండడం, ఖర్చు భారీగా పెట్టాల్సిరావడం, పార్టీల్లో సైతం ఓసీ అభ్యర్థులను నిలువరించి బీఫాంలు దక్కించుకోలేకపోవడం వంటి కారణాలతో జడ్పీటీసీలుగా పోటీచేసే విషయంలో రిజర్వ్‌డ్ స్థానాల్లో తప్ప జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులు దూకుడు ప్రదర్శించలేకపోయినట్లు రాజకీయపార్టీల నేతలు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పరిశీలిస్తే మొత్తం 71 జడ్పీటీసీలకు గాను బీసీ అభ్యర్థులు 25శాతం మేర అంటే 18సీట్లలో విజయం సాధించారు. బీసీ రిజర్వ్‌డ్ సీట్లు 11కి అదనంగా జనరల్ సీట్లలో మరో ఏడుగురు అభ్యర్థులు గెలుపొందారు. అదేవిధంగా జనరల్ స్థానమైన త్రిపురారంలో ఎస్టీ అభ్యర్థి భారతీనాయక్ విజయం సాధించడం గమనార్హం.

గ్రామపంచాయతీలు	నల్లగొండ	సూర్యాపేట	యాదాద్రి	మొత్తం
పంచాయతీల సంఖ్య	835	475	420	1730
బీసీ రిజర్వ్‌డ్ స్థానాలు	209	171	117	497
జనరల్ స్థానాల్లో గెలిచిన బీసీలు	79	52	59	190
మొత్తం బీసీలు గెలిచినవి	288	223	176	687
ఎంపీటీసీ స్థానాలు	346	255	117	718
బీసీ రిజర్వ్‌డ్ స్థానాలు	93	29	39	161
జనరల్‌స్థానాల్లో బీసీలుగెలిచినవి	28	50	12	90
మొత్తం బీసీలు గెలిచినవి	121	79	51	251
జడ్పీటీసీ స్థానాలు	31	23	17	71
బీసీ రిజర్వ్‌డ్ స్థానాలు	4	3	4	11
జనరల్‌లో బీసీలు గెలిచినవి	4	2	1	7
మొత్తం బీసీలు గెలిచినవి	8	5	5	18

కేంద్ర బడ్జెట్‌లో యువతకు నిరాశే : డీవైఎఫ్ఐ

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో యువతకు ఉపాధి అవకాశాలను కల్పించకపోవడంతో నిరాశ మిగిలించిందని డీవైఎఫ్ఐ జిల్లా లధ్యక్షుడు పల్లె మధు కృష్ణ విమర్శించారు. బుధవారం చౌటుప్పల్‌లో జరిగిన డీవైఎఫ్ఐ సమావేశంలో మధు కృష్ణ మాట్లాడుడారు. యువతకు ఎన్నికల్లో చేసిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు.

పర్యావరణం కాపాడేలా బాయిలర్ల నిర్వహణ ఉండాలి

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): కాలుష్యాన్ని నియంత్రిస్తూ పర్యావరణం కాపాడే విధంగా రైస్ ఇండస్ట్రీస్ బాయిర్లను నిర్వహించాలని నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ డిప్యూటీ డైరెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో బుధవారం రైస్‌మిల్లర్లు, బాయిలర్ల నిర్వాహకులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధనం కాల్చడంతో వచ్చే వేడిని ఆప్టిమైజ్ చేయాలని, వ్యర్థ ఉష్ణాన్ని పునరుద్ధరించి బాయిలర్ల ఉష్ణశక్తి పెంచుకునేందుకు అనుసరించాల్సిన శాస్త్రీపద్ధతులపై అవగాహన కల్పించారు. బాయిలర్ పనితీరును దెబ్బతీసే తుప్పును నివారించడం, నీటి శుద్ధిపై యాజమాన్యాలు శ్రద్ధ చూపాలన్నారు. బాయిలర్ ఆపరేటర్ల భద్రతకు జాతీయ ఉత్పాదరమండలి నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఆవిరి పంపిణీలో కీలకపాత్ర పోషించే ఇన్సులేషన్ పైపులను ఆధునీకరించడంతో టర్బైన్లపై ఒత్తిడి తగ్గి ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదన్నారు. అనంతరం బాయిలర్ నిర్వాహకులకు పవర్‌పాయింట్ ప్రొజెక్టర్‌ద్వారా అవగాహనా కల్పించి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ బాయిలర్ ఇన్‌స్పెక్టర్ భీమారావు, మిల్లర్స్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, ఉపాధ్యాక్షుడు సంతోష్‌రెడ్డి, బాబీ, నేషన్ ప్రొడక్టవిటీ కౌన్సిల్ సభ్యులు, రైస్‌మిల్లర్లు, బాయిలర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ వినోద్‌కుమార్

ఎస్సీ వర్గీకరణ చేసిన ధీశాలి సీఎం రేవంత్‌రెడ్డి

మోత్కూరు, ఆలేరు ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ధైర్యంతో ఎస్సీ వర్గీకరణ చేసిన ధీశాలి సీఎం రేవంత్‌రెడ్డి అని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు కొనియాడారు. ఈ నెల నాలుగో తేదీన జరిగిన అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో మాదిగలది ప్రత్యేక స్థానమన్నారు. తెలంగాణలో తొలుత సాయుధ పోరాటం, తర్వాత ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, ఆ తర్వాత మాదిగల పోరాటం.. ఇలా తెలంగాణది మొత్తం పోరాట చరిత్రేనని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో మాదిగలను యాద గిరిగుట్ట ఆలయ ప్రవేశం చేయనిచ్చేవారు కాదని, యాదగిరిగుట్ట ప్రాంతంలోని మాదిగలందరినీ రావి నారా యణరెడ్డి సమీకరించి ఆనాడు ఆలయ ప్రవేశం చేయించారన్నారు. మాదిగలకు కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం కల్పించిందన్నారు. గత ఆగస్టు ఒకటిన ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలు చేయవచ్చని సుప్రీం కోర్టు తీర్పు చెప్పిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి మన రాష్ట్రంలో వర్గీకరణ చేస్తానని ప్రకటించి ఈ రోజు ఎస్సీ వర్గీకరణ చేశారని కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అయిలయ్య

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ప్రభుత్వ విప్

రాష్ట్రంలో చేపట్టిన కుల గణన సర్వేతో సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో బీసీలకు 42శాతం, ఎస్సీలకు 15శాతం రిజర్వేషన్లు ప్రకటించడంపై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య హర్షం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవంగా నిర్వహించుకుందామని ఆయన బీసీలకు పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల ప్రక్రియ రాష్ట్రంలో చరిత్రలో చారిత్రాత్మక ఘట్టమని అన్నారు.



అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేలు

చెక్‌పోస్టులు త్వరలో ప్రారంభిస్తాం



అటవీ శాఖ చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీఎఫ్‌వో రాజశేఖర్

నాగార్జునసాగర్,ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ డివి జన్ అటవీ శాఖ పరిధిలో త్వరలో మూడు చెక్ పోస్టులను ప్రారంభిస్తామని డీఎఫ్‌వో రాజశేఖర్ పెట్ల తెలిపారు. సాగర్ హిల్‌కాలనీ అటవీ శాఖ కార్యాలయం, బెట్టెల తండా, కుకుండుచెట్టు తండా వద్ద ఏర్పాటు చేసిన అటవీ శాఖ చెక్ పోస్టులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం జలాశయం మధ్యలో ఉన్న చాకలిగట్టుకు అటవీ శాఖ లాంచీలో చేరుకొని అక్కడ జింకల సంరక్షణ కేంద్రాన్ని, గజబాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలో అటవీ శాఖ, రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చాకలి గట్టును రూ.15 కోట్లతో అభివృద్ధి చేసి ఏకో టూరిజం కేంద్రంగా ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఈ వారంలో రాష్ట్ర అటవీ, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. అర్బన్ పార్కులో కూడా మరిన్ని వన్య ప్రాణులను వదిలి పర్యాటకులకు, ప్రకృతి ప్రేమికులకు అందుబాటులోకి అర్బన్ పార్కులో సఫారీ ట్రిప్పును నడుపుతామన్నారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఎఫ్ఆర్‌వో రాఘవేంద్ర, ఎఫ్ఎస్‌వోలు రవీందర్ శంకర్ రెడ్డి ఎఫ్‌బీవోలు ఉన్నారు.

సింహళ విహారం అద్భుతం

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నాగార్జునకొండలో శ్రీలంక దేశానికి చెందిన సింహళవిహారం పునర్నిర్మించిన కట్టడం అద్భుతంగా ఉందని శ్రీలంక దేశపు టూరిజం ప్రమోటర్స్ అన్నారు. రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రాంతాలను శ్రీలంకలో ప్రమోట్ చేయడానికి ఆ దేశం టూరిజం, ట్రావెల్స్‌కి చెందిన ప్రతినిధులు బుధవారం నాగార్జునసాగర్‌లోని నాగార్జునకొండ, బుద్ధవనం సందర్శించారు. పర్యాటక శాఖ లాంచీలో జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు చేరుకున్న వారు అక్కడ మ్యూజియం, సింహళ విహారం, అశ్వమేథ యాగశాల, స్నాన ఘట్టాలను తిలకించారు. మూడో శతాబ్దానికి చెందిన శ్రీలంక దేశపు సింహళవిహారాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనానికి చేరుకున్న వారికి ప్రముఖ బౌద్ధ విశ్లేషకులు డాక్టర్ శివనాగిరెడ్డి విశేషాలను వివరించారు. గురువారం నేలకొండపల్లి,ఫణిగిరి, వరంగల్, హనుమకొండలను సందర్శిస్తామని మరుసటి రోజు హైదరాబాద్‌లో ప్రముఖ పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో బుద్ధవనం ఈవో శాసన, మేనేజర్ రవిచంద్ర, టూరిజం అసిస్టెంట్ మేనేజర్ సాయిరాం, తదితరులు ఉన్నారు.



బుద్ధవనం వద్ద శ్రీలంక దేశ టూరిజం ప్రమోటర్స్

ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు జట్టు

ఆలేరు, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 71వ కబడ్డీ సీనియర్ మెన్ పోటీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా కబడ్డీ జట్టు విజయం సాధించి ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు చేరిందని కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూల నాగయ్య తెలిపారు. బుధవారం ఆలేరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కబడ్డీ జట్టుకు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు యాదగిరి, సహాయ కార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి గంధమల్లకుమార్ అభినందనలు తెలిపారు.

చేపల కోసం చెరువుకు గండి

ఆత్మకూర్(ఎస్), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామ శివారు కృష్ణసముద్రం వద్ద చేపలు పట్టేందుకు చెరువుకు గండి పెట్టారు. చెరువు నిండా నీరు ఉన్నందున చేపలు పట్టడానికి గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ గుట్టు చప్పుడు కాకుండా చెరువుకు గండిపెట్టి నీటిని బయటికి పంపుతున్నట్లు స్థానిక రైతులు ఆరోపించారు. చెరువు నీటితో వందల ఎకరాల సాగు అవుతుందని గండి పెట్టినందున నీరు బయటికి వెళ్లి పొలాలు ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుకు గండిపెట్టిన వారిని పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

నల్లగొండ

నకిరేకల్ - మునుగోడు


కల్యాణ తలంబ్రాలు సమర్పిస్తున్న భక్తులు


కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం దంపతులు


స్వామివారి దర్శనం కోసం క్యూ లైన్‌లో నిలబడిన భక్తులు


చెర్వుగట్టులో కొండ కింద భక్తుల సందడి

ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున పార్వతీ జడల రామలింగేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథసప్తమి రోజున ఈ క్షేత్రంలో స్వామివారి కల్యాణం నిర్వహించడం ఆచారంగా వస్తోంది. ఈ కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే వేముల వీరేశం, పుష్ప దంపతులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో దేవదాయశాఖ అధికారి కృష్ణ ప్రభుత్వం తరపున స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవాన్ని తిలకించి తలంబ్రాల బియ్యం సమర్పించేందుకు భక్తులు తరలివచ్చారు.

● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

శివోహం



కల్యాణం..కమనీయం






మహిళల భక్తి పారవశ్యం




తండ్రి భుజాలపై ఓ చిన్నారి




నిఘా : సీసీ కెమెరాలను చెర్వుగట్టు జాతర

నాంపల్లిలో 258 నూతన ఓటర్లు

నాంపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా 258 నూతన ఓటర్లు నమోదైనట్లు ఎంపీడీవో స్వర్ణమేరి కుమారి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం అన్ని రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నూతన ఓటర్లపై అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ ప్రవీన్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపులో వివక్ష


సమావేశంలో మాట్లాడుతున్న నగేష్

చిట్యాల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో రాష్ట్రానికి వివక్ష కనబరిచిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య విమర్శించారు. చిట్యాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఎం కార్యకర్తలు స్థానిక సంస్థల పోరుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్రప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 10వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిట్ట సరోజ, అరూరి శ్రీను, ఐతరాజు నర్సింహ, బొబ్బల సుధాకర్‌రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా కులగణన

● బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్


కులగణన సర్వే రిపోర్టు ప్రత్రాలను దహనం చేస్తున్న జనార్దన్‌గౌడ్

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన కులగణన తప్పుల తడకగా ఉందని, ఆ నివేదికను తిరస్కరిస్తున్నామని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్‌గౌడ్ అన్నారు. బీసీ విద్యార్థి సంఘం, బీసీ సంక్షేమ సంఘం, బీసీ రాజ్యాధికార సమితి, విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సమగ్ర కులగణన సర్వే రిపోర్ట్‌ని బుధవారం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014 నుంచి 2024 వరకు 21 లక్షల మంది బీసీలను తక్కువ చేసి చూపించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడటం కోసం లేని అగ్రకులాల జనాభాను చూపించడం పెద్ద కుట్ర అని ఆరోపించారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. బీసీ సబ్ కమిటీకి బట్టి , పొన్నం ఉండాల్సి ఉన్నప్పటికి ఉత్తమ్ ఎలా ఉంటాడని ప్రశ్నించారు. సమగ్ర కుల సర్వే రిపోర్టును ప్రజల ముందు బయట పెట్టాలన్నారు. మళ్ళీ బీహార్ తరహాలో రెండో సారి కులగణన సర్వే చేయాలన్నారు. బీసీలను నమ్మించి నట్టేట ముంచిన కాంగ్రెస్ బీసీ కులాల లెక్కలను తగ్గించి అవమానించిందని, రాజకీయంగా కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఒక్క రాష్ట్రంలో కుడా సరిగ్గా కులగనగన నిర్వహించలేని కాంగ్రెస్ దేశమంతా ఎలా నిర్వహిస్తుందో రాహుల్ గాంధీ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు , బిసి జేఏసీ చైర్మన్ పెండెం ధనుంజయ్ , బిసి రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి , విజయ్ కుమార్, సతీష్, మహేష్ , నరేష్ తదితరులు పాల్గొన్నారు

వర్గీకరణ చేయడం సరైంది కాదు : మాలమహానాడు


నార్కట్‌పల్లిలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల మహానాడు అధ్యక్షుడు పరమేష్

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ మాలమహానాడు కార్యకర్తలు బుధవారం నార్కట్‌పల్లిలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లె పరమేష్ మాట్లాడుతూ 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకుని వర్గీకరణ చేయడం సరైంది కాదన్నారు. ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారమే వర్గీకరణ చేసి మాలలకు ఏడు శాతం రిజర్వేషన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో దళితుల రిజర్వేషన్లను 15 నుంచి 18 శాతానికి పెంచారని ఇక్కడా అంతే శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. శాసనసభలో తీర్మానం చేసిన రిజర్వేషన్ వర్గీకరణను పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాదాసు నరేష్, యనమల్ల కిరణ్, రామలింగం, బాజ హేమంత్, దాసరి నరేందర్, ఈసం మల్లయ్య, బిట్టు, నర్సింహ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

శాలిగౌరారం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుచేస్తామని అసెంబ్లీలో ప్రకటించి తీర్మానం చేసినందుకు హర్షిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాలిగౌరారంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ అధ్యక్షుడు బోడ అరుణ్‌కుమార్, మార్కెట్ వైస్ చైర్మన్ నరిగె నర్సింహ, పడాల రమేష్, బండపెల్లి కొమరయ్య, గూని వెంకటయ్య, ధనుంజయ్, పరమేష్, గోపీనాథ్, గణేష్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన ఓ తండ్రికి అతని కుమార్తె తలకొరివి పెట్టింది. ఈ సంఘటన మండలంలోని మండలంలోని అవురవాణి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రెడపోతు వెంకట్‌రెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నల్లగొండ ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. వెంకట్‌రెడ్డికి భార్య సుశీలమ్మ, ఇద్దరు కుమార్తెలు రజిత, జ్యోతి ఉండగా వారికి వివాహాలయ్యాయి. దీంతో పెద్ద కుమార్తె రజిత అంతిమ సంస్కారం చేసేందుకు ముందుకొచ్చింది.

శ్రమదోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలి

● ఏఐటీయూసీ కార్యదర్శి దేవేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేకంగా విధానాలపై కార్మికుల శ్రమ దోపిడీ పెరిగిందని, దానిపై వ్యతిరేకంగా ఉద్యమించాలని ఏటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి యాజమాన్యాలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. యాజమాన్యాలకు వేల కోట్ల రాయితీలు ప్రకటిస్తున్న ప్రభుత్వాలు కార్మికుల గురించి ఆలోచించడం లేదన్నారు. పాలకులు అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెఎస్‌రెడ్డి, వెంకట్రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

తిప్పర్తి: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బీమగాని గణేష్ డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీ కార్మికులతో చేయిస్తున్న వెట్టి చాకిరి విధానాన్ని రద్దు చేయాలని, వారికి కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆకిటి లింగయ్య, కార్మికులు చంద్రయ్య, సైదులు, సామేలు, పరశురాములు, వెంకన్న, పరమేష్, లింగయ్య, జానయ్య పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


మర్రిగూడ: పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చేనేత కార్మికులు

మర్రిగూడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వట్టిపల్లి గ్రామంలో శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. బుధవారం తెల్లవారుజామున కల్యాణోత్సవం సందర్భంగా రాజ్‌పేట తండాకు చెందిన పద్మశాలీ కమిటీ ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. వాహనంలో ఊరేగింపు చేస్తూ చేనేత పట్టు వస్త్రాలను వేసి స్వామివారికి సమర్పించారు. అనంతరం రథోత్సవ కార్యక్రమంలో పురోహితుడు శ్రీనివాస్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఘనంగా రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ బృందం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా భావనఋషి కల్యాణం

నాంపల్లి: మండల కేంద్రంలోని భక్త మార్కండేయస్వామి దేవాలయంలో బుధవారం రథసప్తమి సందర్భంగా భావనఋషి భద్రావతి స్వామివార్ల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలతో పాటు హోమం నిర్వహించి ఘనంగా రథోత్సవాన్ని చేపట్టారు. కల్యాణానికి హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు, దేవాలయ కమిటీ చైర్మన్ కోట రఘునందన్, ఉపాధ్యక్షులు గోలి కృష్ణ, శ్రీరాములు, స్థానికులు వెంకటేశ్వర్లు, సంగెపు గణేష్, పరందాములు, లక్ష్మణ్, మల్లేష్, పాపయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ జ్యూరీకి ఉదావత్ లచ్చిరాం ఎంపిక

మర్రిగూడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామర భీమనపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఉదావత్ లచ్చిరాంనాయక్ ఇటీవల నేషనన్ అవార్డు ఎంపికలో భాగంగా నేషనల్ జ్యూరీకి ఎంపికయ్యారు. లచ్చిరాంనాయక్‌ను బుధవారం ఎంఈవో బిట్టు శ్రీనివాస్ ఆయన్ను అభినందించారు. నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా వారు లచ్చీరాంకు బహుకరించిన పుస్తకాలను హెచ్ఎంలకు అందజేశారు. అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ వంత కృషి చేయాలని సూచించారు. పాఠశాల విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు గుణాత్మక విద్యను అందించడానికి కృషి చేస్తున్న హెచ్ఎం ఉదావత్ లచ్చీరాంను అభినందించారు. ఈ కార్యక్రమంలో సబావత్ వెంకట్ కుమార్, ఫరంగి, శ్రీనివాస్, ఉపేందర్, సైదులు, రాములు ఉన్నారు.


హెచ్ఎంలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న లచ్చిరాంనాయక్

పదోన్నతికి నిబంధన వర్తించదా.?


డీఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా లైన్‌మన్‌కు ప్రమోషన్ ఇచ్చారని ఆరోపిస్తూ 327 ఐఎన్‌టీయూసీ ఆధ్వ ర్యంలో బుధవారం విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధానకార్యదర్శి రాజేశ్వర్‌రావు మాట్లా డుతూ సొంత వ్యాపారం చేసుకుంటూ విధు లకు సక్రమంగా నిర్వర్తించని లైన్‌మెన్‌కు ప్రమోషన్ ఇవ్వడంలో డీఈ నిబంధనలకు విరుద్ధంగా వ్యవ హరించారని ఆరోపించారు. దీంతో అర్హులైన కొందరు ఉద్యోగులకు ప్రమోషన్ విషయంలో అన్యాయం జరుగుతుందన్నారు. డీఈ శ్రీనివాస సుధీర్‌కుమార్ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తు న్నా మన్నారు. అనంతరం డీఈ మాట్లాడుతూ ప్రమోషన్ పొందిన లైన్ మన్ గుంటూరు శ్రీనివాస్ విషయంలో అతడి సర్వీస్‌రికార్డును పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో యూనియన్ నాయకులు, సభ్యులు ఎలాంటి అపోహలకు గురికావద్దని ఉద్యోగులందరిని సమానదృష్టితో చూ స్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సత్తార్, అబ్దుల్ పాషా, రమణారెడ్డి, రవినాయక్, కుమార్, గోపాల్‌రెడ్డి, శ్రీరాములు, కొండల్, సైదులు, శ్రీధర్‌రెడ్డి, రవీందర్, వెంకటేశ్వర్లు, ముత్యాలు పాల్గొన్నారు.

రేపు యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి నామినేషన్

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు బలపరిచిన అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డి ఈ నెల 7వ తేదీన శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బక్కా శ్రీనివాసచారి, పెరుమాళ్ల వెంకటేశం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి అనంతరం కలెక్టరేట్ వరకు చేరుకొని కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. విద్యారంగంపై అపార అనుభవం, ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యల పరిష్కారం కోసం నర్సిరెడ్డి ఎంతో కృషి చేశారని అన్నారు. విద్యారంగ బలోపేతం కోసం కోసం శ్రమిస్తూ, తన ఎమ్మెల్సీ నిధులను విద్యారంగానికి మాత్రమే ఖర్చు చేసిన వ్యక్తి అని కొనియాడారు. అధ్యాపక, ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలని వారు కోరారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి ఉపాధ్యాయ, అధ్యాపకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

సరస్వతి విగ్రహానికి శంకుస్థాపన


విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న వెంకటేశ్వర్లు

చండూరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చండూరు మండలం పుల్లెంల గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో సరస్వతీ దేవి విగ్రహానికి బుధవారం శంకుస్థాపన చేశారు. పుల్లెంల గ్రామానికి చెందిన లోక వెంకటేశ్వర్లు సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. హెచ్ఎం ఆర్.సరస్వతి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. విగ్రహదాత వెంకటేశ్వర్లును పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు బొడ్డు సతీష్‌గౌడ్, పిన్నింటి నరేందర్ రెడ్డి, చెరుకు శివగౌడ్, కిరణ్ కుమార్‌రెడ్డి, ఇరిగి శివకుమార్, రాజు, సురేష్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 6నుంచి 10వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


మంచినీటిని పొదుపుగా వాడుకోవాలి


ఖుదాభక్ష్‌పల్లిలో మంచినీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మర్రిగూడ, ఫి బ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం ప్రారంభమైనందున ప్రజలు మంచినీటి ఎద్దడిని నివారించేందుకు నీటిని పొదుపుగా వాడుకోవాలని మిషన్ భగీరథ మండల ఏఈ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మండలంలోని మండలంలోని ఖుదాభక్ష్‌పల్లి, రాజ్‌పేటతండా, సాయిబండతండా, ఆశాపురికాలనీ, పద్మశాలీ కాలనీల్లో ఇంటింటి పర్యటన చేపట్టారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని అవగాహన కల్పించారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుంటే వేసవిలో నీటి ఎద్దడిని నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి యూసుఫ్, రమణ, రాజేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు రామక్క మృతి

శాలిగౌరారం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం గురజాలకు చెందిన నిమ్మనగోటి రామక్క (105) అనే శతాధిక వృద్ధురాలు బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. రామక్కకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రామక్క మృతదేహంపై పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గురజాల తాజా మాజీ సర్పంచ్ గుండా శ్రీనివాస్ దహన సంస్కారాల నిమిత్తం రూ.4 వేలు ఆర్థిక సాయం చేశాడు. ఆయన వెంట వెల్మకంటి యాదయ్య, ఆలకుంట్ల వెంకన్న, నిమ్మనగోటి శ్రీనివాస్, రాచకొండ గణేష్, నిమ్మనగోటి అంతయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980


నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 । కనిష్ఠం 19.4



నమో.. నారసింహ

పాతగుట్టలో లక్ష్మీనరసింహుడిని తిరువీధిలో ఊరేగిస్తున్న అర్చకులు

- కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు
- వైభవంగా నమ్మాళ్వార్ పరమపదోత్సవం
- రేపటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

• 7లో..

శివోహం

- కన్నుల పండువగా చెర్వుగట్టులో శివకల్యాణం
- పోటెత్తిన భక్తజనం

కల్యాణవేదికపైకి ఉత్సవమూర్తులను తీసుకువస్తున్న భక్తులు, కల్యాణోత్సవంలో భాగంగా మాంగళ్యధారణ ఘట్టం

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

దామరచర్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, పేదలకు వ్యతిరేకంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ దేశ సంపదను కార్పొరేట్ శక్తులు దోచుకునే విధంగా ఉందే తప్ప కోట్లాది మంది భారతీయులకు ఉపయోగపడే విధంగా లేదన్నారు. పేదలనుంచి అత్యధికంగా వసూలు చేసిన జీఎస్టీ బిల్లులు కార్పొరేట్ శక్తులకు అప్పజెప్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచలేదని, రైతులకు ఉపయోగపడే కనీస మద్దతు ధర ఊసే లేదన్నారు. సంపద సృష్టి మూలమైన సంఘటిత, అసంఘటితరంగ కార్మికులకు రక్షణలేని బడ్జెట్‌గా ఉందన్నారు. విద్యా, వైద్యానికి నిధులు ఆశాజనకంగా లేవన్నారు. వెంటనే కేంద్రం బడ్జెట్‌ను సవరించి పేదలకు ఉపయోగకరంగా ఉండేవిధంగా చూడాలని, లేదంటే పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, వినోద్‌నాయక్, పాపానాయక్, దయానంద్, ఎర్రనాయక్, కోటిరెడ్డి, ఖాజా మొహినొద్దిన్, సుబాని, దుర్గయ్య, శాంతమ్మ, చంద్రకళ, మట్టయ్య పాల్గొన్నారు.


త్వరలో చెక్‌పోస్టులు ప్రారంభిస్తాం

- రూ.15 కోట్లతో చాకలిగట్టు అభివృద్ధి
- జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్
- పలు చెక్ పోస్టుల పరిశీలన

7

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో బీసీ రిజర్వేషన్ల అంశం రాజకీయాలను కుదిపేస్తోంది. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించే అంశంపై అధికార, ప్రతిపక్షాల నడుమ ఎత్తులు, పైఎత్తులు సాగుతున్నాయి. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం స్థానిక సంస్థల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వడానికి ఆస్కారం లేనందున, బీసీలకు తమ పార్టీ తరఫున 45శాతం సీట్లు కేటాయిస్తామని, బీఆర్ఎస్, బీజేపీ అందుకు సిద్ధం కావాలని అధికార కాంగ్రెస్ నాయకులు సవాలు విసురుతున్నారు.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



బీసీల హవా

- స్థానిక సంస్థల్లో అధికసంఖ్యలో సీట్ల కైవసం
- గత ఎన్నికల్లో సత్తా చాటిన బీసీ నాయకులు

గత ఎన్నికల్లోనూ జనరల్ స్థానాల్లో పోటీచేసిన బీసీలు పలువురు విజయకేతనం ఎగురవేసి తమ సత్తా చాటారు. ఉమ్మడి జిల్లాలో పలువురు బీసీ నాయకులు గ్రామపంచాయతీ సర్పంచ్‌లుగా, ఎంపీటీసీ, జడ్పీటీసీలుగానూ జనరల్ స్థానాల్లో పోటీచేసి గెలుపొందారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జనరల్ స్థానాల్లో ఏడుగురు నాయకులు జడ్పీటీసీలుగా గెలుపొందితే, 90మంది ఎంపీటీసీలుగా, 190 మంది పంచాయతీ సర్పంచ్‌లుగా గెలుపొంది బీసీ జెండా ఎగరవేశారు. ఈసారి కాంగ్రెస్ నుంచి అధిక సీట్లు కేటాయిస్తే, అదే స్థాయిలో బీఆర్ఎస్, బీజేపీ, వామపక్షాల నుంచి సైతం అభ్యర్థిత్వాలు దక్కించుకొని సత్తా చాటేందుకు బీసీ నాయకులు సిద్ధమవుతున్నారు.

40శాతం పంచాయతీల్లో సర్పంచ్‌లుగా గెలిచిన బీసీలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2019లో చివరిసారిగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మొత్తం సర్పంచ్ పదవుల్లో 40శాతం బీసీ సామాజికవర్గాల నాయకులు గెలుపొందారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,730 గ్రామ పంచాయతీలకు 687 పంచాయతీల్లో సర్పంచ్‌లుగా బీసీనేతలు గెలుపొందారు. 497 గ్రామపంచాయతీ సర్పంచ్ పదవులు బీసీలకే రిజర్వ్ కాగా, మరో 190 జనరల్‌స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులు పోటీపడి గెలుపొందారు. జనరల్ స్థానాల్లో నల్లగొండ జిల్లాలో 79 మంది, సూర్యాపేటలో 52మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 59 మంది సర్పంచులుగా విజయం సాధించారు. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లోనే జనరల్‌స్థానాల్లో ఎక్కువమంది బీసీలు సర్పంచ్‌లుగా గెలుపొందారు.

ఎంపీటీసీ స్థానాల్లో 35శాతం దక్కించుకున్న బీసీలు

ఉమ్మడి జిల్లాలో మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ స్థానాల్లోనూ జనరల్ కేటగిరీలో బీసీలు గణనీయంగా సీట్లు దక్కించుకున్నారు. మొత్తం సీట్లలో 35శాతం బీసీలు గెలుపొందారు. మొత్తం ఉమ్మడి జిల్లాలో 718 ఎంపీటీసీ స్థానాలకు 251మంది బీసీ నాయకులు విజయం సాధించారు. ఇందులో బీసీ రిజర్వేషన్ స్థానాలు 161 అయితే, మిగిలిన 90 జనరల్ సీట్లలో బీసీలు గెలుపొందారు. జనరల్ కేటగిరీలోని ఎంపీటీసీ స్థానాల్లో అత్యధికంగా సూర్యాపేట జిల్లాలో 50మంది, నల్లగొండలో 28 మంది, యాదాద్రి భువనగిరిలో 12మంది ఎంపీటీసీగా గెలిచారు.

జడ్పీటీసీ స్థానాల్లో 25శాతం సీట్లలో విజయం

జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులుగా మాత్రం బీసీనాయకులు

మిగతా 7వ పేజీలో

రూ.196.51 కోట్లు

- రైతు భరోసాకు వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు



నల్లగొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మరోసారి రైతుభరోసా నిధులను విడుదల చేయడానికి బుధవారం జిల్లా వ్యవసాయ అధికారులనుంచి వివరాలను సేకరించింది. అధికారులు నల్లగొండ జిల్లాలో 1,55,232 మంది రైతులకు రూ.88,48,08,319, సూర్యాపేట జిల్లాలో 96,473 మంది రైతులకు రూ.61,58,62,090, యాదాద్రి భువనగిరి జిల్లాలో 78,795 మంది రైతులకు రూ.46,44,93,195 మొత్తంగా ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా రూ.196,51,63,604 నిధులకు ప్రతిపాదనలు పంపారు. అయితే బుధవారం నుంచి ఎకరంలోపు రైతుల ఖాతాల్లో జమ అవుతుండగా, మిగతా వారికి ఒకటిరెండు రోజుల్లో పూర్తి కానున్నాయి. గత నెల 26న ప్రభుత్వం మండలానికి ఓ గ్రామం చొప్పున ఎంపికచేసి అదేరోజు నూటికి నూరు శాతం రైతులకు రైతు భరోసా సాయం అందజేసిన విషయం తెలిసిందే. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ కొనసాగింపు పథకం కాబట్టి నిధుల జమకు ఎలాంటి ఆటంకం లేదని సమాచారం. అయితే మిగతా రైతులందరికీ కూడా వరుసగా రైతు భరోసా నిధులు చెల్లిస్తారా? లేదంటే మళ్లీ మధ్యలో నిలిపివేసి ఆ తర్వాత చెల్లిస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.

వివాహాది శుభకార్యాలకు ఆర్టీసీ బస్సులు

- పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు అద్దెకు ఇచ్చేందుకు నిర్ణయం
- కిలోమీటర్‌కు రూ.7తగ్గిస్తున్నట్లు తెలిపిన అధికారులు



7

నక్షా.. మునిసిపల్ ఆస్తులకు రక్ష

- ప్రజల ఆస్తులు పక్కాగా డ్రోన్‌లతో చిత్రీకరణ
- శాటిలైట్‌తో అనుసంధానం



6

ఎస్సీ వర్గీకరణ తీర్మానాన్ని హర్షిస్తూ..



8

వర్గీకరణను ఉపసంహరించుకోవాలి

- మాల మహానాడు ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



జిల్లాకేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నల్లగొండ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): శాసనసభ, శాసన మండలిలో ఎస్సీ వర్గీకరణను ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించడాన్ని మాల, మహానాడు ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో బుధవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఎలాంటి ప్రామాణికం లేకుండా జనాభా లెక్కలు తీసుకుని వర్గీకరణ చేయడం విచారకరమన్నారు. రాష్ట్రంలో ఎస్సీల మొత్తం జనాభా 62లక్షలు చూపించి వర్గీకరణలో మాత్రం 51లక్షల జనాభాను మూడు విభాగాలుగా చూపించారని ఆరోపించారు. ఇందులో 10లక్షల మాలల జనాభాను తక్కువగా చూపించారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే వర్గీకరణ విషయాన్ని ఉపసంహరించుకోవాలని, లేదంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ స్టీరింగ్ కమిటీ సభ్యుడు గోలి సైదులు, విజయ్‌కుమార్, యాదగిరి, రవి, విజయ్, రామకోటి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా కులగణన సర్వే

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న చక్రహరి రామరాజు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన తప్పుల తడకగా మారిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు అన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర కులగణనలో బీసీలు రాష్ట్రంలో 46శాతం ఉన్నారని ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాకేంద్రంలోని బీసీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటివరకు భారతదేశంలో జరిగిన సర్వేలన్నింటిలో బీసీలు 50శాతానికి పైగానే ఉన్నట్లు చూపించారు కానీ, ఈ సర్వే ప్రకారం రాష్ట్రంలో బీసీలు 46 శాతమే ఉన్నారని చూపడం దారుణమన్నారు. గ్రామాల్లో అత్యధికంగా ఉండేది బీసీలు మాత్రమేనని, కానీ వారి శాతం ఎలా తగ్గిందని ప్రశ్నించారు. సర్వే సమగ్రంగా జరగకపోవడమే దీనికి కారణమన్నారు. నల్లగొండలోనే చాలా మంది తమ కుటుంబాలను సర్వే చేయించలేదని చెప్పారని, అదేవిధంగా హైదరాబాదులో సగం మందికి పైగా ఈ సర్వేలో పాల్గొనలేదన్నారు. దీనికి ప్రభుత్వం ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణమన్నారు.

చాలా మంది సర్వేలో పాల్గొనలేదు

సర్వేలో ప్రభుత్వం 57 రకాల వివరాలను అడగడంతో చాలామంది భయపడి కూడా ఈ సర్వేలో పాల్గొనలేదని చక్రహరి రామరాజు అన్నారు. 2014లో గత ప్రభుత్వం ఒక్కరోజులో జరిపిన కుటుంబ సర్వేలో ముంబై వంటి ఇతర రాష్ట్రాల్లో ఉన్నవారు వచ్చి పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వం ఈ సర్వే నివేదికను ప్రజల ముందు ఉంచాలని, ప్రతీ గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, ప్రతి వార్డులో అదే విధంగా హైదరాబాదులో వివిధ ప్రాంతాల్లో ఎవరెవరు సర్వేలో పాల్గొన్నారో వారి జాబితా ప్రకటించాలన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ సర్వేను పునః సమీక్ష జరిపి కేవలం కులగణన మాత్రమే జరిపి ఖచ్చితమైన బీసీల లెక్కలను తేల్చాలన్నారు. బీసీల డిమాండ్లను నెరవేర్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే బీసీలంతా తిరుగుబాటు చేస్తారన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు కాసోజు విశ్వనాథం, గౌరవ అధ్యక్షుడు కంది సూర్యనారాయణ, సీనియర్ ఉపాధ్యక్షుడు కేశబోయిన శంకర్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు నకరకంటి కాశయ్య గౌడ్, గోలి విజయకుమార్, ఆదినారాయణ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

- కేంద్ర పాపులేషన్ రీసెర్చ్ సెంట్రల్ బృందం సభ్యుడు డాక్టర్ రంజిత్



డాక్టర్లతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

మర్రిగూడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో ఉన్న రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కేంద్ర పాపులేషన్ రీసెర్చ్ సెంట్రల్ బృందం సభ్యుడు డాక్టర్ రంజిత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. డాక్టర్ల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారులు దూర ప్రాంతాల నుంచి వచ్చి రోగులకు సేవలు అందించడం బాగుందన్నారు. అదేవిధంగా ఆస్పత్రిలో ఎంతమంది వైద్యులు ఉన్నారు?, సిబ్బంది కొరత ఉందా? అని డాక్టర్ శాలినిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కల్యాణ్ చక్రవర్తి, జీవోఐ డాక్టర్ కార్తీక్, రీసర్చ్ ఆఫీసర్ దేవరాజు, పీహెచ్‌సీ మర్రిగూడ డాక్టర్ శంకర్, మెడికల్ ఆఫీసర్ కల్యాణ్ పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి తాగినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని షీ టీమ్ సీఐ కోట కరుణాకర్ అన్నారు. డ్రగ్స్‌పై పట్టణంలోని ఇండియన్ రెడ్ క్రాస్ భవన్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. గంజాయి వాడినా, రవాణా చేసినా వారికి పదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధించనున్నట్లు తెలిపారు. యువత చెడుదారి పట్టకుండా ఉండాలంటే కుటుంబంతో ఎక్కువ సమయం కేటాయించాలన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు డ్రగ్ కిట్ అందజేసినట్లు తెలిపారు. ఆ కిట్‌తో పరీక్ష నిర్వహిస్తే 22 రకాలు డ్రగ్స్ బయటపడతాయని పేర్కొన్నారు. సమావేశంలో ఎక్సైజ్ ఎస్ఐ విజయ్‌కుమార్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ యూత్ కోఆర్డినేటర్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి, నెహ్రూ యువ కేంద్రం అధికారి ప్రవీణ్‌సింగ్, పెరిక సంపత్ కుమార్, కొండనాయక్, ప్రసాద్, బాబురావు పాల్గొన్నారు.

మిర్యాలగూడ
నాగార్జునసాగర్-దేవరకొండ

ప్రధాని మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



ప్రధాని మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

దేవరకొండ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మధ్యతరగతి ప్రజలకు మేలు చేసే విధంగా కేంద్ర బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకు ఎలాంటి ట్యాక్స్ కట్టాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షనీయమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. దేవరకొండలో బుధవారం కేంద్ర బడ్జెట్ సామాన్య ప్రజలకు, రైతులకు మేలు చేసే విధంగా ఉందని ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ దేశ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కర్నాటి సురేష్, బెజవాడ శేఖర్, వస్కుల సుధాకర్, నేతాళ్ల వెంకటేష్, పద్మ, భాస్కర్, సహదేవ్ పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

దేవరకొండ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు చంద్రన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు హనుమంతు వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం చంద్రన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.50వేల నగదు, గోల్డ్‌మెడల్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు హనుమంతు రాఘవేందర్‌గౌడ్, కొలుకు లపల్లి గెల్వయ్య, ఎస్ఎస్.చారి, పాండురంగారావు, ఉపాధ్యాయులు బక్క య్య, సంతోష్‌రెడ్డి, గిరి లక్ష్మయ్య, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల పరిశీలన



పట్టణంలోని సాగర్‌రోడ్‌లో మ్యాన్‌హోల్‌ను గుర్తిస్తున్న అధికారులు

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను బుధవారం ఉన్నతాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కందుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో వేసిన భూగర్భ పైప్‌లైన్ల మరమ్మతు నిర్వహించడంతో పాటు పట్టణంలో విలీనమైన కాలనీల్లో పైప్‌లైన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అమృత్, పబ్లిక్ హెల్త్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పనులు ఇప్పటికే చేపట్టామని, పనులు పూర్తయిన అనంతరం గుత్తేదారు సంస్థ నిర్వహణ చేపటే విధంగా కాంట్రాక్టు ఒప్పందం జరిగిందన్నారు. పట్టణంలోని తాళ్లగడ్డ, ఈదులగూడలలో గతంలో నిర్మించిన సేవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)లను వినియోగంలోకి తేనున్నట్లు తెలిపారు. కోదాడ- జడ్చర్ల రహదారి విస్తరణ, నూతన రోడ్డు నిర్మాణంలో పూడిపోయిన మ్యాన్‌హోళ్లను మెటల్ డిటెక్టర్‌తో గుర్తించి యంత్రాల సాయంతో పూడికతీత చేపడతామని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు. ఆయనవెంట మునిసిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్, అధికారులు సత్యనారాయణ, మనోహర, సాయితేజ, వెంకటరమణ, రమేష్‌రెడ్డి, దాసు, కృష్ణ పాల్గొన్నారు.

ఆటలు ఆడిస్తూ..బొమ్మలతో బోధిస్తూ

● పనిచేసిన ప్రతి పాఠశాలలో ప్రత్యేకత చాటుకుంటున్న బాలరాజు

వినూత్న పద్ధతుల్లో విద్యా బోధన చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు ఓ ఉపాధ్యాయుడు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా తాను పనిచేసిన ప్రతి పాఠశాలలో గ్రామస్థులను భాగస్వాములను చేస్తూ ఆయా పాఠశాలలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చి పెడుతున్నారు ముద్దాడ బాలరాజు
(ఆంధ్రజ్యోతి-డిండి)

శ్రీకాకుళం జిల్లా హిర మండలం దుర్బాలపురం గ్రామానికి చెందిన బాలరాజుది నిరుపేద కుటుంబం. పేదరికం కారణంగా అనారోగ్యంతో బాధపడుతున్న తన తండ్రికి సరైన వైద్యం అందించే స్తోమత లేకపోవడంతో 15 ఏళ్ల వయస్సులోనే తండ్రిని కోల్పోయారు బాలరాజు. ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆర్థిక సాయంతో ఇంటర్మీడియట్, టీచర్ ట్రైనింగ్ పూర్తి చేశాడు. 2012 డిసెంబరులో నిర్వహించిన డీఎస్సీ ద్వారా నల్లగొండ జిల్లా నుంచి నాన్‌లోకల్ కేటగిరిలో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. మొదట నేరేడుచర్లలో పనిచేస్తూ బదిలీపై 2015లో డిండి మండలంలోని వావిల్‌కోల్ గ్రామానికి వచ్చారు. వావిల్‌కోల్, రుద్రాయిగూడెం పాఠశాలలో పనిచేసిన సమయంలో మూతపడే స్థితిలో ఉన్న పాఠశాలలకు ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. పాఠశాలలో ఏక సంఖ్యగా ఉన్న విద్యార్థుల సంఖ్యను 50 వరకు పెంచి అధికారుల మన్ననలు పొందారు. ఇటీవల బదిలీపై కొత్త తండా ప్రాథమిక పాఠ శాలలో ఉపాధ్యా యుడిగా బాధ్యతలు స్వీకరించారు. అక్కడ విద్యార్థులు లేకపోవడంతో అధికారులు డిప్యుటేషన్‌పై తవక్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో పని చేసేందుకు అవకాశం కల్పించారు. బాలరాజు ఆట, పాటల ద్వారా బోధనపకరణాలను తానే స్వయంగా తయారు చేస్తూ విద్యా బోధన చేసేవాడు. విభిన్న బోధన అంశాలతో విద్యా ర్థులలో విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తూ పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ వచ్చాడు. తరగతి గదిలో ఉత్తమ, మధ్యమ స్థాయి వెనుకబడిన మూడు రకాల పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక పద్ధతుల్లో విద్యా బోధన చేస్తూ బాలరాజు విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలు పొందారు. గ్రామస్థులను పాఠశాలలో భాగస్వాములను చేస్తూ తన సొంత డబ్బులను ఖర్చు చేసి విద్యార్థులకు కావాల్సిన సామగ్రిని సమ కూరుస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్న బాలరాజు సేవలను గుర్తించిన ప్రభుత్వం 2017లో మండల స్థాయిలో, 2021లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసింది.



బోధనోపకరణాలతో బోధిస్తున్న బాలరాజు

పోటీ పరీక్షలు రాసేవారికి శిక్షణ

నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు, పోటీపరీక్షలు రాసే వారికి సెలవు దినాల్లో బాలరాజు శిక్షణ ఇస్తుంటారు. మోటివేషన్ తరగతుల నిర్వహణతో పాటు బోధన పద్ధతులపై అవగాహన కల్పిస్తుంటాడు. నిరుద్యోగులు పోటీ పరీక్షల్లో రాణించడానికి అందుకు అవసరమైన 12 పుస్తకాలను రాసి అందుబాటులోకి తెచ్చాడు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి తన శక్తినంతా వినియోగించుకోవాలని నిరుద్యోగులకు సూచనలు చేస్తున్నాడు బాలరాజు.

టీశాట్ ద్వారా బోధన విధానాలపై విశ్లేషణ

రాష్ట్ర ప్రభుత్వం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం టీ శాట్ ఛానల్ రూపొందించింది. ఈఛానల్ ద్వారా టెట్, డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు బోధన విధానాలపై విశ్లేషణ, సలహాలు, సూచనలు ఇస్తుంటాడు బాలరాజు. ఉపాధ్యాయుడిగా పెడగాజికల్ అనలిస్టుగా పోటీ పరీక్షల నిపుణుడిగా విద్యారంగానికి విశేష సేవలను అందిస్తున్నారు. నిరుద్యోగుల కోసం యూట్యూబ్, గుగూల్ ఛానళ్ల ద్వారా తరగతులు బోధిస్తున్న బాలరాజుకు 4 లక్షల మందికిపైగా ఫాలోవర్స్ ఉన్నారు.

సేవలకు పలు పురస్కారాలు

విద్యా రంగానికి బాలరాజు అందిస్తున్న సేవలను గుర్తించిన వివిధ సంస్థలు అనేక పురస్కారాలు అందజేశాయి. 2021లో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఫిలాల్ ట్రోపిక్ సొసైటీ ఆఫ్ ఇండియా కీర్తి పురస్కారం, 2022లో పుడమి సాహితీ వేదిక జాతీయ విద్యారత్న పురస్కారం, 2022లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఆచార్య దేవోభవ నేషనల్ అవార్డులను అందుకున్నారు. 2023లో హైదరాబాద్‌కు చెందిన టీవీ ఆర్టిస్టు అసోసియేషన్ ఆదర్శ కళానిలయం ఇచ్చే నంది పురస్కారం, 2023 తెలుగుతేజం జాతీయ విశిష్ట సేవ పురస్కారం స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ శ్రీశ్రీ అంతర్జాతీయ కళా వేదిక సౌజన్యంతో నంది పురస్కారం, అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకల సందర్భంగా సాంస్కృతిసంఘం సేవాసంస్థ కళానిలయం హైదరాబాద్ ఇంటర్నేషనల్ జీనీస్ బుక్‌ఆఫ్ రికార్డు అవార్డును అందజేశారు. హైదరాబాద్ ఆదర్శ కళానిలయం ప్రతిష్టాత్మక గురుబ్రహ్మ జీవిత సాఫల్య పురస్కారం అందజేశారు. 2022లో ఆర్టిస్టు అసోసియేషన్ నంది పురస్కారం అందజేశారు. ఈనెల 9న ఢిల్లీలో జరిగే జాతీయ విద్యా సెమినార్‌కు హాజరయ్యేందుకు బాలరాజు పాల్గొననున్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం

చింతపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకిలి శేరుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సుగుణ మాట్లాడతూ... కేంద్రా లకు వచ్చే పౌష్టికాహా రం అందించాలన్నారు. కార్యక్రమంలో టీచర్ షమీం, ఆయా యాదమ్మ పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా వర్తింపజేయాలి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని బాదలాపురం గ్రామ పేదలు మేడి మరియమ్మ, విజయ, రూప కోరారు. ఈ మేరకు గ్రామ పేదలతో కలిసి సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అర్హులైన పేదలకు ఆత్మీయ భరోసా వర్తింపచేయలేదని ఆరోపించారు. గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి హామీ జాబ్ కార్డులు లేనివారికి, భూమి ఉన్నవారికి, వేరే గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కుటుంబ సభ్యులు, తమ బంధువులకు లబ్ధిదారుల జాబితాలో చేర్చి డబ్బులు వారి ఖాతాలో జమ చేశారని ఆరోపించారు. గ్రామ సభలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తే లిఖిత పర్వకంగా ఫిర్యాదు చేయాలని పట్టించుకోలేదని ఆరోపించారు. సుమారు మరో 40 మంది అర్హులైన పేదవారిని పట్టించుకోలేదని చెప్పారు. దీనిపై సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ స్పందిస్తూ విచారణ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారని అన్నారు. కార్యక్రమంలో శిరీష, సంతోషమ్మ, శైలజ, సరోజన, ఇద్దమ్మ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడి దీవెనలు అందరిపై ఉండాలి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని మేడారం లక్ష్మీనరసింహస్వామి జాతర సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే పటేల్ రమేష్‌రెడ్డితో కలిసి పూజలు చేశారు. జాతరకు వచ్చే భక్త లకు అసౌకర్యాలు కలగకుండా తగు జాగ్ర త్తలు తీసుకోవాలని దేవాలయ కమిటీ సభ్యు లకు వారు సూచించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, టూరిజం కార్పొ రేషన్ చైర్మన్‌ను శాలువాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్యయాదవ్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఆలయకమిటీ చైర్మన్ యెల్గురి చెన్నారెడ్డి, ఆలయ ధర్మకర్త తేరటిపల్లి విఠల్, వైస్ చైర్మన్ మిర్యాల సత్యం, మాజీ చైర్మన్ హనుమారెడ్డి, మాజీ ఎంపీపీ నారాయణ, వెంకట్‌రెడ్డి, అక్బర్, షైబెల్లి, జాని, దత్రు, శ్రీరాం, సైదయ్య, బొడ్డుపల్లి శ్రీనయ్య పాల్గొన్నారు.

● డిండి : మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన లక్ష్మీవేంక టేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, రథోత్సవంలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పాల్గొని పూజలు చేశారు. రథాన్ని లాగి తన భక్తిని చాటుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, నాగార్జునరెడ్డి, భాస్కర్ రెడ్డి, నూకం వెంకటేష్, బాదమోని శ్రీనివాస్‌గౌడ్, శైలేజ్, గడ్డమీది సాయి, జంగారెడ్డి, శశిధర్‌రెడ్డి, యా సాని హనుమంతురెడ్డి, సుమిత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో భావనకు డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకుంటున్న భావన

దేవరకొండ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి తండాకు చెందిన అన్నలూరి భావన(పాత్లావత్‌బుజ్జి). ఫిజి కల్ ఎడ్యుకేషన్‌లో గౌరవ డాక్టరేట్ పొందారు. భావన మల్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠ శాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న పాలమూరువిశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్స్‌లర్, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంత్ రాథోడ్ సూచనలతో పీహెచ్‌డీ పూర్తి చేశారు. తన డాక్టరేట్‌కు సహకరించిన గురు వులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధికి ప్రజలు సహక రించాలని మునిసిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ అన్నారు. బుధవారం కార్యాలయంలో మాట్లాడుతూ ఆస్తి, నీటి పన్నును సకాలంలో చెల్లించాలన్నారు. నూతనంగా బాధతలు స్వీకరించిన 28 మంది వార్డు ఆఫీసర్లను రెవెన్యూ విభాగంతో అనుసంధానం చేశామన్నారు. ఆస్తిపన్ను వసూళ్లతో పాటు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రెగ్యులరైజేషన్ పనులు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నూతన అభివృద్ధి పనుల ప్రారంభాన్ని తాత్కాలికంగా నిలిపామన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల, కాలనీలలో భారీ బోర్డులు, ఆర్చ్‌ల నిర్మాణాలకు అనుమతి పొందాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, శ్వేత పాల్గొన్నారు.

సన్మానం

పెద్దఅడిశర్లపల్లి,ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మన ఊరు గుడిపల్లి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు చరిత్రకారులను గుడిపల్లి మండల కేంద్రంలోని గ్రంథాలయంలో బుధవారం సత్కరించారు. పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ శివనాగిరెడ్డి, చరిత్రకారుల సభ్యుడు యూనిస్ ఫర్హాన్ చేస్తున్న పరిశోధనలను స్మరించుకుంటూ వారిని శాలువాలతో సన్మానించారు. అనంతరం పురావస్తు పరిశోధకులు డాక్టర్ శివనాగిరెడ్డి మాట్లాడుతూ మన ఊరు గుడిపల్లి స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు బాగున్నాయని కొనియాడారు కార్యక్రమంలో బోయ శ్రీనివాస్‌రెడ్డి, పడాల సైదులు, శేఖర్, గోలి ఈశ్వర్,శంకర్ పాల్గొన్నారు.

అభినందన

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో నిర్వహించిన 3వ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్- 2025లో సాగర్ ఫైలాన్ కాలనీకి చెందిన కానిస్టేబుల్ పురుషోత్తం బంగారు పతకాలు సాధించారు. 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 200 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో బంగారు పతకాలు, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో వెండి పతకం సాధించారు. దీంతో ఆయనను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆయనను అభినందించారు

పదోన్నతికి నిబంధన వర్తించదా.?



డీఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా లైన్‌మన్‌కు ప్రమోషన్ ఇచ్చారని ఆరోపిస్తూ 327 ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధానకార్యదర్శి రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ సొంత వ్యాపారం చేసుకుంటూ విధు లకు సక్రమంగా నిర్వర్తించని లైన్‌మెన్‌కు ప్రమోషన్ ఇవ్వడంలో డీఈ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపించారు. దీంతో అర్హులైన కొందరు ఉద్యోగులకు ప్రమోషన్ విషయంలో అన్యాయం జరుగుతుందన్నారు. డీఈ శ్రీనివాస సుధీర్‌కుమార్ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తు న్నామన్నారు. అనంతరం డీఈ మాట్లాడుతూ ప్రమోషన్ పొందిన లైన్ మన్ గుంటూరు శ్రీనివాస్ విషయంలో అతడి సర్వీస్‌రికార్డును పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో యూనియన్ నాయకులు, సభ్యులు ఎలాంటి అపోహలకు గురికావద్దని ఉద్యోగులందరిని సమానదృష్టితో చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సత్తార్, అబ్దుల్ పాషా, రమణారెడ్డి, రవినాయక్, కుమార్, గోపాల్‌రెడ్డి, శ్రీరాములు, కొండల్, సైదులు, శ్రీధర్‌రెడ్డి, రవీందర్, వెంకటేశ్వర్లు, ముత్యాలు పాల్గొన్నారు.

సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలి : సీపీఎం



హాలియా : సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

హాలియా, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల ఉద్యమాలకు సిద్ధ కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. హాలియాలోని సుందరయ్య భవన్‌లో బుధవారం నిర్వహించిన సీపీఎం సాగర్ నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాటాడారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంపన్న వర్గాలకు దొచిపెట్టే విధంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఏ ఒక్కటి పూర్తి స్థాయిలో అమలుచేయకుండా మాయమాటలతో కాలం గడుపుతుందన్నారు. అనంతరం బస్టాండ్ వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, అనుముల, నిడమనూరు, త్రిపురారం, తిరుమలగిరి పెద్దవూర మండల కార్యదర్శులు అవుతా సైదయ్య, కందుకూరి కోటేష్, దైద శ్రీను, దుబ్బ రామచంద్రయ్య, జె.రవినాయక్, కోమండ్ల గురవయ్య, సోమయ్య, వేము లకొండ పుల్లయ్య, చిరు నాగార్జున, కారంపూడి ధనలక్ష్మి, కోరేరమేష్, రెవెల్లి వెంకటయ్య, దొరేపల్లి మల్లు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో రైతులకు, కార్మికులకు అన్యాయం

దేవరకొండ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు, కార్మికుల వ్యతిరేక బడ్జెట్ అని సీపీఎం జిల్లా సహాయకార్యదర్శి నల్ల వెంకటయ్య అన్నారు. బుధవారం దేవరకొండలో సీపీఎం, సీఐటీయూ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం అనుకూలంగా వ్యవహారిస్తూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందన్నారు కార్యక్ర మంలో నాయకులు యేసోబు, శక్రునాయక్, వెంకటయ్య భిక్షపతి పాల్గొన్నారు.



దేవరకొండ: కేంద్ర బడ్జెట్‌పై నిరసన తెలుపుతున్న సీపీఎం, సీఐటీయూ నేతలు

● మాడ్గులపల్లి : మండల కేంద్రంలో కేంద్ర బడ్జెట్ తీరును నిరసిస్తూ బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వంలో తెలం గాణాకు చెందిన ఇద్దరు బీజేపీ మంత్రులు, 8 మంది ఎంపీలు ఉండి కూడా తెలంగాణాకు నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫల మయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, బొమ్మకంటి అంజయ్య, ఊరుగొండ శ్రీను, అయితగాని విష్ణు, జుకూరి నాగయ్య, మునగాల నారాయణరెడ్డి, ఎలిజాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

P పబ్లిక్ డిమాండ్
PUBLIC DEMAND

రోడ్డుపైనే మురుగు

చింతపల్లి,(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని 13వ వార్డులో గతంలో అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం డ్రైనేజీ పైపులు లీక్ కావడంతో మురుగునీరు రోడ్డుపైనే పారుతుంది.. దీంతో స్థానికంగా దుర్వాస వెదజల్లుతుండటడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరారు.



వీ.టీ.నగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

మాదిగలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు అండగా ఉంటుందని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టడాన్ని హర్షిస్తూ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభి షేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ 30 ఏళ్ల పోరాటమే ఈ విజయానికి కారణమన్నారు. ఈ కార్య క్రమంలో గుడిపూడి శ్రీనివాస్, రామకృష్ణ, ఉబ్బపల్లి కాశయ్య, రాజశేఖర్, శ్రవణ్, సురేష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుపై హర్షం

పెద్దవూర : ఎస్సీ వర్గీకరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టడం అభినందనీయమని ఎమ్మార్పీఎస్ నాయకుడు పులిమాల కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమో దించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు కృషి చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి, మాజీ మంత్రి జానారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కుక్కమూడి ముత్యాలు, ఆడెపు రామలింగయ్య, దున్న వెంకటేశ్వర్లు, మల్లెపల్లి నరేందర్, హరి, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

కంకర మిల్లు తొలగించాలి

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజీనగర్ గ్రామంలో కంకర మిల్లును తొలగించాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం అడిషనల్ కలెక్టర్, మైనింగ్ అధికారి ఏడీ జాకబ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కంకర మిల్లు నుంచి వెలువడే దుమ్ము, ధూళి, పేలుడు సమయంలో భారీ శబ్దాలతో అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కంకర మిల్లును తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఉమేర్ ఖాసిం కొమ్మనేని విజయ్‌కుమార్, ఆదిత్యనగర్ కాలనీవాసులు ఉన్నారు.